VELTHURU TELUGU DAILY
# వెలుతురు
## తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
శుక్రవారం 15.05.2026
సంపుటి: 07 సంచిక: 341
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper



## కేరళ సీఎంగా వీడీ సతీశన్

- కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం
- అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ
- సీఎం రేసులో రమేశ్ చెన్నితాల, కేసీ వేణుగోపాల్
- కేడర్ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని నిర్ణయం
- యూడీఎఫ్‌కు 102 స్థానాలతో స్పష్టమైన మెజారిటీ
- ఎల్‌డీఎఫ్ 10 ఏళ్ల పాలనకు ముగింపు

2

# న్యూఢిల్లీలో బ్రిక్స్ విదేశాంగ మంత్రుల భేటీ

- పాల్గొన్న ప్రధాని మోదీ, కీలక దౌత్య చర్చలకు శ్రీకారం
- బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి ప్రధాని మోదీ హాజరు
- సభ్య దేశాలు, పరిశీలక దేశాల ప్రతినిధులతో ఆప్యాయ భేటీ
- దౌత్య ప్రతినిధులతో ప్రధాని మోదీ గ్రూప్ ఫోటోలు
- సమావేశానికి కేంద్ర మంత్రి జైశంకర్ స్వాగతం పలికారు
- రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా సహా కీలక దేశాల ప్రతినిధుల హాజరు
- ఆర్థిక సహకారం, వాణిజ్యం, అభివృద్ధి అంశాలపై ప్రధాన చర్చలు
- ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై విస్తృత సమీక్ష

న్యూఢిల్లీ వెలుతురు మే 14:

దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. సమావేశ ప్రాంగణానికి చేరుకున్న ఆయన సభ్య దేశాల విదేశాంగ మంత్రులు, పరిశీలక దేశాల ప్రతినిధులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఉన్నత స్థాయి దౌత్య సమావేశాల్లో పాల్గొన్న ప్రతినిధులతో ప్రధాని మోదీ గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశాలు గురువారం నుంచి మే 15 వరకు న్యూఢిల్లీలో జరుగుతున్నాయి. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ..మిగతా 2లో






## ప్రజా సమస్యల పరిష్కారమే
# పరమావధి

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు..
- రామన్నపేట క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2

ఖమ్మం వెలుతురు మే 14:

పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నుంచి.. ఆడబిడ్డల ఉచిత ప్రయాణం వరకు ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం కార్పొరేషన్ 1, 59, 60 డివిజన్ల ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ..మిగతా 2లో



2

## బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

- రెండు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయన్న న్యాయవాది
- హైకోర్టులో ఉత్కంఠభరిత వాదనలు
- భగీరథ్ తరపున వాదించిన నిరంజన్ రెడ్డి
- పోక్సో చట్టం వర్తించదంటూ కోర్టుకు వివరణ
- సీల్డ్ కవర్‌లో ఆధారాలు సమర్పిస్తామని ప్రకటన

హైదరాబాద్ వెలుతురు మే 14:

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్కు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టులో గురువారం వాడివేడి వాదనలు జరిగాయి. భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కీలక వాదనలు వినిపించారు. ఈ కేసులో బాధితురాలు అసలు మైనర్ కాదని, అందువల్ల పోక్సో చట్టం వర్తించదని కోర్టుకు తెలిపారు. గతంలో బాధితురాలిపై నమోదైన మరో కేసులో పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో ఆమెను మేజర్‌గా పేర్కొన్నారని వాదించారు. బాధితురాలికి సంబంధించి రెండు వేర్వేరు జనన తేదీ ధ్రువపత్రాలు ఉన్నాయని, వాటిలో పుట్టిన తేదీలు ..మిగతా 2లో





# నీట్ లీక్‌పై పారదర్శక విచారణ

## సీఎం రేవంత్ రెడ్డి

**నీట్ పరీక్ష రద్దు అంశంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

- పేపర్ లీక్ ఘటనపై సమగ్ర, పారదర్శక విచారణకు డిమాండ్
- లక్షలాది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని ఆవేదన
- దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- పరీక్షల విశ్వసనీయతను కాపాడాలని కేంద్రానికి సూచన
- పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్య
- విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలని సూచన
- బీజేపీ, బీఆర్ఎస్‌లపై సీఎం తీవ్ర విమర్శలు
- పరీక్షల నిర్వహణలో వైఫల్యాలపై రాజకీయ విమర్శలు గుప్పించిన సీఎం

హైదరాబాద్ వెలుతురు మే 14:

నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేపర్ లీక్ ఘటనపై సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల శ్రమ, కృషి వృథా కాకుండా ఉండాలంటే పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత ..మిగతా 2లో



2

## కేరళం సీఎంగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



2

## కాన్వాయ్ వాహనాల తగ్గించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

- ఇంధన పొదుపు దిశగా నిర్ణయం
- ప్రధాని మోదీ పిలుపును ఆచరిస్తున్న తెలంగాణ గవర్నర్
- తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గించాలన్న నిర్ణయం
- లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలు తగ్గించినట్లు వెల్లడి
- ఇంధన పొదుపు చర్యలకు పూర్తిగా మద్దతు ప్రకటించిన గవర్నర్
- ఖర్చుల నియంత్రణకు ఈ చర్యలు ఉపయోగపడతాయని వ్యాఖ్య

## రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్



- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- 40కి పైగా అజెండా అంశాలకు ఆమోదం
- 25 భారీ ప్రాజెక్టులకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

## ఎర్రకోట పేలుడు వెనుక భారీ కుట్ర

- అల్‌ఖైదాతో నిందితుల లింకులు
- ఎన్ఐఏ సంచలన ఛార్జిషీటు
- 7,500 పేజీలతో భారీ ఛార్జిషీటు దాఖలు



2



2

## ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

- మే 30 నుంచి మూడో దశ సర్ ప్రక్రియ
- ఏపీ, తెలంగాణ షెడ్యూల్ ఖరారు
- 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభం
- 36.73 కోట్ల మంది ఓటర్ల డేటా పరిశీలన
- ప్రక్రియలో 3.94 లక్షల మంది అధికారులు
- ఏపీలో జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే
- సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల

## పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

3

- ఆందోళనల్లో అన్నదాతలు: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



## బీసీ సంక్షేమశాఖ సలహాదారు వీహెచ్ బాధ్యతల స్వీకరణ

- పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, మంత్రి శ్రీధర్ బాబు



2

# ఎర్రకోట పేలుడు వెనుక భారీ కుట్ర

ఢిల్లీ వెలుతురు మే 14:

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట వద్ద చోటుచేసుకున్న పేలుడు ఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పేలుడు వెనుక అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా హస్తం ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారికంగా ధ్రువీకరించింది. మరణించిన ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్ నబీతో పాటు మరో తొమ్మిది మందికి అల్‌ఖైదా అనుబంధ సంస్థ అయిన అన్సార్ ఘజ్వత్‌ఉల్‌హింద్ తో సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ పటియాలా హౌస్‌లోని ప్రత్యేక కోర్టులో సమర్పించిన ఛార్జిషీటులో పేర్కొంది. దాదాపు 7,500 పేజీల ఈ భారీ నివేదికలో నిందితులు ఏ విధంగా జిహాదీ కుట్రను పన్నారో ఆధారాలతో సహా వివరించింది. హైఇంటెన్సిటీ వాహన ఆధారిత ఐఈడీ ని ఉపయోగించి భారీ ప్రాణ, ఆస్తి నష్టానికి నిందితులు పాల్పడ్డారని, దీని వెనుక లోతైన సాంకేతిక మరియు ఫోరెన్సిక్ ఆధారాలు లభ్యమయ్యాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్ట్ చేసినట్లు, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును ఎన్ఐఏ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆరు రాష్ట్రాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించింది. జమ్ము కశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ మరియు ఢిల్లీ ప్రాంతాల్లో జరిపిన ఈ ఆపరేషన్‌లో సుమారు 588 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. దాదాపు 395 కీలక పత్రాలు, 200కు పైగా భౌతిక సాక్ష్యాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. నిందితులు 'ఆపరేషన్ హెవెన్లీ హింద్' పేరుతో భారత ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చివేసి, దేశంలో షరియా పాలనను అమలు చేయాలనే ప్రమాదకర లక్ష్యంతో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. 2022లో శ్రీనగర్‌లో రహస్య సమావేశం ఏర్పాటు చేసుకుని, విదేశాలకు పారిపోయే ప్రయత్నం విఫలమైన తర్వాత వీరు తమ సంస్థను పునర్వ్యవస్థీకరించుకుని ఈ దాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిందితుల్లో కొందరు వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా ఉగ్రవాద భావజాలానికి ప్రభావితమై ఈ విధ్వంసానికి సహకరించారు. పేలుడు పదార్థాల తయారీలో నిందితులు అత్యంత ప్రమాదకరమైన పద్ధతులను అవలంబించినట్లు ఎన్ఐఏ ఛార్జిషీటులో వెల్లడించింది. మార్కెట్లో దొరికే రసాయనాలను సేకరించి, అత్యంత శక్తివంతమైన 'ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్స్ అనే పేలుడు పదార్థాన్ని నిందితులే స్వయంగా తయారు చేసుకున్నారని తెలిపింది. వీటిని పరీక్షించేందుకు వివిధ రకాల ప్రయోగాలు కూడా చేశారని, భవిష్యత్తులో రాకెట్లు మరియు డ్రోన్లకు అమర్చే ఐఈడీల ద్వారా భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకోవాలని ప్రణాళికలు రూపొందించారని పేర్కొంది. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సర్క్యూట్లు, ఎంఎంఓ అనోడ్ వంటి పరికరాలను సమకూర్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా, వీరి వద్ద ఏకే47 రైఫిళ్లు, దేశీయ తుపాకులు వంటి ఆయుధాలు కూడా ఉన్నట్లు ఆధారాలు లభించాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు కూడా తమ కార్యకలాపాలను విస్తరించాలని వీరు భావించినట్లు ఛార్జిషీటులో వివరించారు. దర్యాప్తులో భాగంగా శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి నిందితుల కుట్రను ఎన్ఐఏ బట్టబయలు చేసింది. పేలుడులో మరణించిన వ్యక్తిని తొలుత గుర్తించడం కష్టమైనప్పటికీ, డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ సాంకేతికత ద్వారా అతను ఉమర్ ఉన్ నబీ అని నిర్ధారించారు. వాయిస్ విశ్లేషణ మరియు డిజిటల్ ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా నిందితుల మధ్య జరిగిన సంభాషణలను, వారి రహస్య ప్రణాళికలను అధికారులు వెలికితీశారు. ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా యూనివర్సిటీ సహా జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల నుండి సేకరించిన ఆధారాలు ఈ కేసులో కీలకంగా మారాయి. యూఏ(పీ)ఏ చట్టం 1967తో పాటు భారతీయ న్యాయ సంహిత, ఆర్మ్స్ యాక్ట్ వంటి కఠినమైన సెక్షన్ల కింద నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ భారీ ఉగ్ర మాడ్యూల్‌ను సకాలంలో ఛేదించడం ద్వారా దేశంలో జరగబోయే మరిన్ని ఘోరమైన దాడులను భగ్నం చేయగలిగామని ఎన్ఐఏ అధికారులు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. సంక్లిష్టమైన ఈ కేసులో పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కాన్వాయ్ వాహనాల తగ్గించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

హైదరాబాద్ వెలుతురు మే 14:

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన అధికారిక కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని సందేశానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన గవర్నర్, వాహనాల వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాన్ని తాము ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్ భవన్ (లోక్ భవన్) లో సైతం సగం వాహనాలను తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. వాహనాల సంఖ్య తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, పరిపాలనలో ఇంధన వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు కూడా ప్రధాని మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల కోరారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఈ దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చిన్న చిన్న మార్పులతో పెద్ద స్థాయిలో ఇంధన పొదుపుకు సహకరించవచ్చని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఈ అంశంపై అవగాహన కల్పించాలని గవర్నర్ సూచించారు. విద్యార్థుల్లో ఇంధన పొదుపు అలవాట్లను పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా ప్రధాని మోదీ పిలుపు దేశవ్యాప్తంగా అమలవుతున్న నేపథ్యంలో, తెలంగాణ గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం పరిపాలనలో ఇంధన పొదుపు దిశగా మరో అడుగుగా భావించబడుతోంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

**(మొదటి పేజీ తరువాయి)**

**అర్హతే ప్రామాణికం.. అండగా ప్రభుత్వం**

ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుని మూడవ ఏట అడుగుపెట్టిన సందర్భంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, తమ ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. కేవలం మంజూరు చేయడమే కాకుండా, ప్రతి సోమవారం పనుల పురోగతిని బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం 'భూభారతి' చట్టం ద్వారా ధరణి కష్టాలను తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

**సమస్యలకు పరిష్కార వేదిక - ప్రజా దర్బార్**

నియోజకవర్గ వ్యాప్తంగా 14 క్లస్టర్లుగా విభజించి ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇది 13వ క్లస్టర్ అని మంత్రి తెలిపారు. చిన్న చిన్న సమస్యలను వేదికపైనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించడమే కాకుండా వారం రోజుల్లో పరిష్కరించే అంశాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. మూడు నెలల లోపు ప్రతి న్యాయమైన అర్జీని పరిష్కరించి తీరుతామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం పరిపాలనకు సంబంధించి ప్రతి శాఖను విశ్లేషించి, ప్రజలకు మేలు చేయడమే ఈ 99 రోజుల కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

**అభివృద్ధి చూపించి మళ్లీ ఓట్లు అడుగుతా**

రెండు ఏళ్ల క్రితం ఈ డివిజన్లలో రోడ్లు, కరెంటు, తాగునీటి పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే ఆలోచించాలని మంత్రి అన్నారు. ఇంకా కొన్ని రోడ్లు వేయాల్సి ఉందని, ఆ పనులు కూడా పూర్తి చేశాకే మళ్లీ ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతానని ఆయన స్పష్టం చేశారు. మాటలు చెప్పడం కాదు.. పని చేసి చూపించడమే తన నైజమని ఉద్ఘాటించారు.

**సంక్షేమ పథకాలపై మాట్లాడుతూ**

200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీతో పాటు ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలు పేద ఇంటి గుమ్మానికి చేరుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యార్థుల కోసం డైట్ చార్జీలను 40 శాతం, ఆడపిల్లల కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ఇప్పుడు అర్హులైన వితంతువులు, వయోవృద్ధుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ డీసీపీ రామానుజం, వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు, ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


# న్యూఢిల్లీలో బ్రిక్స్ విదేశాంగ మంత్రుల భేటీ

**(మొదటి పేజీ తరువాయి)**

వచ్చిన వివిధ దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్వాగతం పలికారు. ఈ సమావేశానికి రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరా, ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో, ఇథియోపియా మంత్రి గెడియన్ తిమోతేవోస్ హెస్సెబోన్, యూఏఈ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఖలీఫా షహీన్ అల్ మరార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశాల్లో ప్రధానంగా ఆర్థిక సహకారం, అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధి వ్యూహాలు, అలాగే ప్రపంచ మరియు ప్రాంతీయ స్థిరత్వానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. సభ్య దేశాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి 1 నుంచి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఇది భారత్‌కు నాలుగోసారి అధ్యక్ష బాధ్యత కావడం విశేషం. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లో కూడా భారత్ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. ప్రపంచ ఆర్థిక, రాజకీయ సమీకరణాల్లో బ్రిక్స్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ అధ్యక్షతలో జరుగుతున్న ఈ భేటీ ద్వారా సభ్య దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు
# ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

అమరావతి వెలుతురు మే 14:



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, మౌలిక అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా విస్తృత స్థాయి నిర్ణయాలు ఈ భేటీలో తీసుకున్నట్లు సమాచారం. క్యాబినెట్‌లో ప్రధానంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 భారీ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. శుద్ధ ఇంధన రంగాన్ని ప్రధానంగా తీసుకుని గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్ యూనిట్లు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ చర్యల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను శుద్ధ ఇంధన రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకుంది. ఇక వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా ప్రకాశం జిల్లా, రాయలసీమ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళికకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నీటి వినియోగం, పంటల విభిన్నీకరణ, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. పారిశ్రామిక రంగంలో డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలపై క్యాబినెట్‌లో విస్తృత చర్చ జరిగింది. ఈ రంగాల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కర్నూలు విమానాశ్రయాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (PPP) మోడల్‌లో అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. రాష్ట్రంలో విమానయాన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (MSME) నిధుల లభ్యతను సులభతరం చేసే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా సమావేశంలో సమీక్ష జరిగింది. సాగునీటి కాల్వల విస్తరణ, రహదారుల అభివృద్ధి, పరిశ్రమల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా చర్చించారు. మొత్తంగా ఈ క్యాబినెట్ నిర్ణయాలు రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## ఓటరు జాబితా ప్రక్షాళనకు
# రంగం సిద్ధం

న్యూఢిల్లీ వెలుతురు మే 14:

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా మూడో దశకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటరు జాబితాను సర్వసమగ్రంగా, తప్పులు లేకుండా రూపొందించడమే లక్ష్యంగా మే 30వ తేదీ నుంచి ఈ ప్రక్రియను దశలవారీగా చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మూడో దశలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి మొత్తం 16 రాష్ట్రాలు మరియు మూడు కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఓటర్ల వివరాల నమోదులో పారదర్శకతను పెంచేందుకు, అనర్హుల తొలగింపునకు ఈ సవరణ ప్రక్రియ దోహదపడనుంది. అయితే, మంచు కురిసే హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్ మరియు లద్దాఖ్‌లలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అక్కడ మాత్రం షెడ్యూల్‌ను తర్వాత వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మూడో దశ సవరణ ప్రక్రియలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా సుమారు 3.94 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు రంగంలోకి దిగనున్నారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు వంటి వివరాలను స్వయంగా తనిఖీ చేస్తారు. ఈ ప్రక్రియలో అధికారులు ఎటువంటి పక్షపాతం లేకుండా పని చేసేలా చూసేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కూడా ఈసీ కోరింది. రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లు ఈ తనిఖీల్లో అధికారులకు తోడుగా ఉండి, జాబితాలో ఉండాల్సిన అసలైన ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద తప్పనిసరిగా ఏజెంట్లను ఉంచాలని, తద్వారా జాబితా రూపకల్పనలో రాజకీయ పక్షాల అభ్యంతరాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఎన్నికల సంఘం పార్టీలకు దిశానిర్దేశం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయానికొస్తే, ఇక్కడ జూన్ 15వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు నెల రోజుల పాటు బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. ఈ తనిఖీలు పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై ఎవరికైనా ఫిర్యాదులున్నా, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా లేదా తప్పులను సరిదిద్దుకోవాలన్నా ఆగస్టు 20 వరకు గడువు ఉంటుంది. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి, సెప్టెంబర్ 22వ తేదీన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పక్కాగా ఉన్న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో కూడా ఇదే షెడ్యూల్ అమలు కానుంది. తెలంగాణలో ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియ జూన్ 25న ప్రారంభమై జులై 24 వరకు కొనసాగుతుంది. ఒక నెల రోజుల పాటు సాగే ఈ ఇంటింటి సర్వే అనంతరం, జులై 31న ముసాయిదా జాబితాను బహిర్గతం చేస్తారు. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పంజాబ్ రాష్ట్రంలోనూ ఇదే కాలక్రమం అనుసరిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి ఇతర పెద్ద రాష్ట్రాల్లో జూన్ 30న సర్వే మొదలై అక్టోబర్ 7న తుది జాబితా వెలువడనుంది. నాగాలాండ్, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాల్లో వేర్వేరు తేదీల్లో ఈ ప్రక్రియ జరగనుండగా, డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.

# కేరళం సీఎంగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్ వెలుతురు మే 14:

కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని అన్నారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# బీసీ సంక్షేమశాఖ సలహాదారు వీహెచ్ బాధ్యతల స్వీకరణ

వెలుతురు హైదరాబాద్ మే 14 :

వి. హనుమంతరావు బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా హైదరాబాద్ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ రావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమ పథకాల అమలు, విద్యా మరియు ఉపాధి అవకాశాల విస్తరణలో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఆ దిశగా సలహాదారుల పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌పై పారదర్శక విచారణ జరపాలి

**(మొదటి పేజీ తరువాయి)**

అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్రానికి పలు సూచనలు చేసినట్లు సీఎం తెలిపారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచాలని, పేపర్ లీక్ ఘటనలకు అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేపర్ లీక్ మాఫియాపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులు మళ్లీ ఇలాంటి పరిస్థితుల వల్ల ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలు విద్యార్థులకు అవకాశాల వేదికగా ఉండాలని, కానీ వారి జీవితాలను నాశనం చేసే పరిస్థితి రాకూడదని సీఎం అన్నారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనలపై రెండు పార్టీల వైఖరిని ఆయన ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల మధ్య ఈ విషయంలో పెద్ద తేడా లేదంటూ విమర్శలు గుప్పించారు. మొత్తంగా నీట్ యూజీ వివాదం నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.


# బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

**(మొదటి పేజీ తరువాయి)**

భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో మరో తేదీని ప్రస్తావిస్తున్నారని, అసలు ఏ తేదీ సరైందో కోర్టే నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. భగీరథ్ నిర్దోషి అని నిరూపించే పలు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని సీల్డ్ కవర్‌లో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు వెల్లడించారు. ఈ ఆధారాలను సమర్పించే అవకాశం ఇవ్వాలని కోరారు. భగీరథ్ ఎలాంటి ప్రత్యేక హక్కులు కోరడం లేదని, అయితే ఈ కేసును సాధారణ కేసుల మాదిరిగా చూడకూడదని నిరంజన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రిగా ఉండటంతో రాజకీయ, సామాజిక ఒత్తిడులు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాల్ పోస్టర్లు, మెట్రో రైళ్లలో ప్రచారాలు చేస్తూ భగీరథ్‌ను దోషిగా చిత్రీకరిస్తున్నారని, సోషల్ మీడియా ద్వారా కూడా దుష్ప్రచారం సాగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయకముందే మీడియా ట్రయల్స్ ద్వారా నిందితుడిని శిక్షించే ప్రయత్నం జరుగుతోందని వాదించారు. భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తే విచారణకు పూర్తిగా సహకరిస్తారని, తమ వద్ద ఉన్న సాక్ష్యాలను పోలీసుల ముందుంచేందుకు అవకాశం కల్పించాలని కోర్టును కోరారు. మధ్యంతర రక్షణ లేకపోతే ముందస్తు బెయిల్ పిటిషన్ ప్రయోజనం లేకుండా పోతుందని, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోతారని తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పించే అంశంపై ఉత్తర్వులను శుక్రవారానికి వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# కేరళ సీఎంగా వీడీ సతీశన్

కేరళం వెలుతురు మే 14:



కేరళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వి.డి. సతీశన్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో ఏఐసీసీ అధికారికంగా ఆయన పేరును ప్రకటించింది. కేరళలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కీలక రాజకీయ పరిణామం ఇది. కేరళ ముఖ్యమంత్రి పదవి కోసం రమేశ్ చెన్నితాల, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వంటి సీనియర్ నేతల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, చివరికి పార్టీ అధిష్ఠానం వి.డి. సతీశన్ వైపే మొగ్గు చూపింది. రాష్ట్ర కాంగ్రెస్ కేడర్ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్న తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేరళ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మొత్తం 140 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) 102 స్థానాలు గెలుచుకుని ఘన విజయం సాధించింది. దీంతో పదేళ్ల ఎల్‌డీఎఫ్ పాలనకు ముగింపు పలికినట్లైంది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత సీఎం అభ్యర్థి ఎంపికపై పార్టీలో తీవ్ర చర్చ జరిగింది. పలు సీనియర్ నేతల మధ్య పోటీ వాతావరణం నెలకొన్నప్పటికీ, చివరికి అధిష్ఠానం రాష్ట్ర స్థాయి నాయకత్వ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సతీశన్‌ను ఎంపిక చేసింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 10 రోజుల తర్వాత ఈ నిర్ణయం ప్రకటించడం విశేషం. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలో వి.డి. సతీశన్ ప్రతిపక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ విధానాలపై బలమైన విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయడంలో ఆయన ముఖ్య పాత్ర వహించారు. పార్టీని ప్రతిపక్ష స్థాయి నుంచి అధికారంలోకి తీసుకురావడంలో ఆయన కృషి కీలకమని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

వి.డి. సతీశన్ పూర్తి పేరు వడస్సేరి దామోదరన్ సతీశన్. 1964 మే 31న ఎర్నాకులం జిల్లా నెట్టూరులో జన్మించారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన కేరళ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. ఆయన పరావూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఆరు సార్లు — 2001, 2006, 2011, 2016, 2021, 2026 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం కేరళ రాజకీయాల్లో అనుభవం, ప్రజాదరణ, పార్టీ నమ్మకాన్ని కలిపి చూసినప్పుడు సతీశన్ సరైన ఎంపికగా భావిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# చేప ప్రసాదం పంపిణీ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.
- నిరంతర విద్యుత్ త్రాగునీరు ప్రత్యేక దృష్టి సారించాలి.
- రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీకి సంబంధించిన చేపట్టే విస్తృత ఏర్పాట్లను సహచర మంత్రులతో సమీక్షించారు.
- జూన్ 8న మృగశిర కార్తి ముహూర్తంలో మొదటగా సుమారు 60 వేల మంది ఆస్తమా బాధితులు ప్రసాదం స్వీకరించే అవకాశం





హైదరాబాద్ వెలుతురు మే 14:

జూన్ 8, 2026న ఉదయం 11:00 గంటలవరకు 24 గంటల పాటు మృగశిర కార్తి ముహూర్తంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 179 ఏళ్ల చరిత్ర కలిగిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, వివిధ శాఖల అధికారులు, బత్తిని కుటుంబ సభ్యులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 179 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసం, నమ్మకంగా కొనసాగుతున్న చేప ప్రసాదం కార్యక్రమం హైదరాబాద్ నగర ప్రత్యేకతగా నిలిచిందన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వేలాది మంది భక్తులు, ఆస్తమా బాధితులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, ఈసారి సుమారు లక్షలాది మంది ప్రసాదం స్వీకరించే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను సమీక్షించి లోపాలను సరిదిద్దుకుంటూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భారీ జన సామర్థ్యం దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, క్రౌడ్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని సూచించారు. పిక్‌పాకెటింగ్, చోరీలు, చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో రాత్రంతా పూర్తి స్థాయి లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అవసరమైన మందులు, సీపీఆర్ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది మరియు వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పోలీస్, ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డ్, విద్యుత్, రెవెన్యూ, ఆర్టీసీ, రవాణా, ఫిషరీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య మరియు సమాచార శాఖ సమన్వయంతో పనిచేస్తూ బ్యారికేడింగ్, క్యూ లైన్లు, వాటర్‌ప్రూఫ్ షెడ్లు, టెంట్లు, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, అవగాహన ప్రచారం, అదనపు బస్సు సర్వీసులు, అగ్నిమాపక భద్రత తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సూచించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, 1847లో బత్తిని వీరన్న గౌడ్ ప్రారంభించిన ఈ చేప ప్రసాదం పరంపర 179 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసంతో కొనసాగుతుండటం విశేషమన్నారు. ఇటువంటి సాంప్రదాయాలను పరిరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన చేపలను తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని, అదనపు నిల్వ కూడా సిద్ధంగా ఉంచాలని ఫిషరీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం కూడా పరిశుభ్రత చర్యలు సమర్థంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాలు, మతాలు, వర్గాలకు చెందిన ప్రజలు విశ్వాసంతో ఈ కార్యక్రమానికి వస్తారని, ఇది అందరి కార్యక్రమమని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు.

సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, ప్రాంతీయ సమాచార అధికారి రాములు, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

- ఆందోళనల్లో అన్నదాతలు: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ వెలుతురు మే 14:

వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ రైతులు రోజువారీగా ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్య ఇప్పటివరకు 40 శాతం కూడా కొనుగోళ్లు జరగలేదని ప్రశ్న నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో పాల్గొన్న బీజేపీ నేత అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందుల్లోకి నెట్టబడ్డారని ఆరోపణగన్నీ సంచుల సరఫరా కూడా సరిగా లేకపోవడం విమర్శకు కారణం తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్తే మ, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణరైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచనవరి, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పంటల కొనుగోలు ప్రక్రియ సకాలంలో జరగకపోవడంతో రైతులు ప్రతిరోజూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు.గురువారం రోజున నిర్మల్ జిల్లాలో జరిగిన రైతు ధర్నాలో పాల్గొన్న ఆయన, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు కనీసం 40 శాతం కూడా పంటల కొనుగోళ్లు జరగలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు.అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రైతు కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, గన్నీ సంచులు కూడా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల లోపం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, వెంటనే సమగ్ర కొనుగోలు వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు.

## దేశ యువత ఎంఎస్ బిట్టా ని చూసి నేర్చుకోవాలి

- పి.ప్రసన్నకుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్ వెలుతురు మే 14:



కాంగ్రెస్ పార్టీ గర్వంగా చెప్పుకునే నాయకుడు ఎంఎస్ బిట్టా గారు అని దేశ ప్రజలు అందరూ ఆయన గురించి తెలుసుకుంటే మంచిది అని ఈ రోజుల్లో రాజకీయ నాయకులు ఒక సారి ఆయన ఈ దేశం కొసం చేసిన పనులు చూసి మనం కూడా అదే బాటలో నడవాలి అని అన్నారు. హైద్రాబాద్ లో ఒక రోజు పర్యటన సందర్బంగా వచ్చిన ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ 1990 ధషకంలొ ఆయన తో కలిసి పని చేసిన విషయం పై చర్చించారు.ఆయన తో కలిసి పని చేసిన విషయాలను పంచుకున్నారు అని

పి.ప్రసన్నకుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

దేశ రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ప్రముఖ జాతీయ నాయకుడు, సామాజిక సేవకుడు మరియు ఉగ్రవాద వ్యతిరేక ఉద్యమకారుడు Maninderjeet Singh Bitta (ఎం.ఎస్. బిట్టా) గారు భారతదేశంలో దేశభక్తి, జాతీయ ఐక్యత మరియు ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి ప్రతీకగా నిలిచిన నాయకులలో ఒకరు.

పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జన్మించిన బిట్టా గారు యువకుడిగా కాంగ్రెస్ సేవాదళ్‌లో చేరి ప్రజాసేవలో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఇండియన్ యూత్ కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఎదిగి, మాజీ ప్రధాని పివి. నరసింహారావు నాయకత్వ కాలంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారు. తన రాజకీయ జీవితంలో పంజాబ్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

దేశవ్యాప్తంగా బిట్టా గారికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది ఆయన ఉగ్రవాద వ్యతిరేక పోరాటం. ఉగ్రవాదం వల్ల అమాయక ప్రజలు, సైనికులు మరియు పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమాజానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఆయన "All India Anti Terrorist Front" సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది కుటుంబాలకు సహాయం చేయడం, యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడం, జాతీయ సమైక్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

బిట్టా గారు స్వయంగా పలుమార్లు ఉగ్రదాడులకు గురైనా ధైర్యం కోల్పోకుండా ప్రజాజీవితంలో కొనసాగడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం. 1992లో అమృత్‌సర్‌లో జరిగిన కార్ బాంబు పేలుడులో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం 1993లో ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో జరిగిన భారీ బాంబు దాడిలో కూడా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనల వల్ల ఆయనకు శాశ్వత గాయాలు అయినప్పటికీ దేశసేవ పట్ల ఆయన నిబద్ధత ఏమాత్రం తగ్గలేదు.

"ఉగ్రవాదానికి మతం ఉండదు" అనే సందేశాన్ని బిట్టా గారు తరచుగా ప్రజల్లోకి తీసుకెళ్తూ ఉంటారు. దేశ భద్రత, జాతీయ సమైక్యత, సైనికుల గౌరవం మరియు దేశభక్తి అంశాలపై ఆయన బహిరంగ వేదికలలో నిరంతరం మాట్లాడుతుంటారు.

రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా దేశభక్తి భావాలను సమాజంలో పెంపొందించే ఉద్యమకారుడిగా బిట్టా గారు విశేష గౌరవాన్ని పొందారు. చిన్ననాటి నుంచే Jallianwala Bagh massacre ఘటన ప్రభావంతో దేశభక్తి భావాలు పెంచుకున్నారని పలువురు ప్రస్తావిస్తుంటారు.

దేశ సమైక్యత, జాతీయ భద్రత మరియు ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఆయన చేసిన సేవలు భారత ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయి....

## గవర్నర్‌తో హర్కర వేణుగోపాల్ రావు భేటీ



- మర్యాదపూర్వకంగా భేటీ
- పరస్పరం నేతల శుభాకాంక్షలు
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ

హైదరాబాద్ వెలుతురు మే 14:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు గురువారం లోక్ భవన్‌లో గౌరవ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా వారు రాష్ట్రానికి సంబంధించిన పలు పరిపాలనా అంశాలపై గవర్నర్‌తో స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, అలాగే వివిధ శాఖల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై సాధారణంగా సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది.

గవర్నర్‌తో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించినట్లు సమాచారం. ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగా జరిగిందని అధికారులు తెలిపారు.

## తండ్రి మరణం, పేదరికం లో ఎదిగొచ్చిన కూతురి వివాహంతో సతమతం



- సతమతమవుతున్న తండ్రి లేని నిరుపేద ముస్లిం యువతి వివాహానికి రాజ్ గోపాల్ రెడ్డి భరోసా

మునుగోడు వెలుతురు మే 14:

తండ్రి మరణించి పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద ముస్లిం యువతి వివాహానికి అండగా నిలిచారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు పట్టణానికి చెందిన షాహిదా భర్తను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబాన్ని నెట్టు కొస్తుంది... ఎదిగొచ్చిన తన కూతురి వివాహం చేయడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని కలిసిన వెంటనే తన కుమార్తె వివాహానికి గాను కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా 1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు...హామీ మేరకు ఈరోజు లక్ష రూపాయల చెక్కును మునుగోడు పట్టణ స్థానిక నాయకులు వెళ్లి పెళ్లి కూతురుకు అందించారు...

నియోజకవర్గ ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా తన సొంత బిడ్డలుగా బావిస్తూ చేతనైన సహాయం చేస్తూ ఆదరిస్తున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని జన్మజన్మలకు గుర్తుంచుకుంటామని అన్నారు షాహిదా కుటుంబ సభ్యులు

## బీసీల కోసం పోరాడిన నేతకు కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

హైదరాబాద్ వెలుతురు మే 14:




గురువారం రోజున ప్రభుత్వ బీసీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు గారిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందించిన ఆయన, రాజ్యసభ సభ్యునిగా, కర్ణాటక ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా, అలాగే బీసీ హక్కుల కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో ముందుండి పోరాడారు.

బీసీల అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన వి.హెచ్. గారికి కేబినెట్ హోదాతో కూడిన ఈ గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారికి, కాంగ్రెస్ అధిష్ఠానానికి హృదయపూర్వక ధన్యవాదాలు.

బీసీ సమాజ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటివరకు చేసిన పోరాటాల మాదిరిగానే, ఈ బాధ్యతలోనూ బీసీల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాం.

# నీట్ లీకులు...
# పాలకులు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం..!

ఉన్నత చదువుల కోసం ఒక మధ్యతరగతి కుటుంబం చేసే త్యాగాలు ఈ దేశంలో ఎవరూ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న పట్టణాల నుంచి, దూర గ్రామాల నుంచి, వ్యవసాయ కుటుంబాల నుంచి, కూలి పనులు చేసుకునే ఇళ్ల నుంచి వేలాది మంది పిల్లలు ఒక్క ఆశతో ముందుకు సాగుతుంటారు, "డాక్టర్ కావాలి". ఆ కల కోసం వారు బాల్యాన్నే తాకట్టు పెడతారు. ఉదయం కోచింగ్, రాత్రి మాక్ టెస్టులు, పండుగలు లేని జీవితం, సెలవులేని ప్రయాణం, కుటుంబాన్నీ, ఊరునీ, స్నేహితులీ్న వదిలి హాస్టళ్లలో గడిపే ఒంటరి రోజులు... ఇవన్నీ ఒకే పరీక్ష చుట్టూ తిరుగుతుంటాయి. బిజెపి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ పరీక్ష నిర్లక్ష్యం వల్ల, లక్షలాది మంది విద్యార్థుల ఆశలన్నింటినీ ఒక్క క్షణంలో నేలమట్టం చేసే సంఘటనగా నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు నిలిచిపోయింది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించడం దేశ విద్యావ్యవస్థపై మరొకసారి తీవ్రమైన అనుమానాలను రేకెత్తించింది.

పరీక్ష రద్దయిందన్న వార్త కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదు. అది లక్షలాది మంది విద్యార్థుల మనోభావాలపై పిడుగుపాటు. ఇప్పటికే సంవత్సరాల తరబడి ఒత్తిడిలో బతుకుతున్న యువతకు ఇది మరొక మానసిక దెబ్బ. నీట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థుల జీవితం సాధారణ విద్యార్థుల జీవితంలా ఉండదు. చాలా కుటుంబాలు అప్పులు తీసుకుని కోచింగ్ ఫీజులు చెల్లిస్తాయి. కొందరు రైతులు పొలాలు అమ్ముకుంటారు. కొందరు తల్లిదండ్రులు బంగారం కుదువ పెట్టి, చదువుపిస్తారు. ఒక సీటు వస్తే కుటుంబ భవిష్యత్తే మారిపోతుందని నమ్మి తమ పిల్లలను నగరాలకు పంపిస్తారు. అలాంటి పరిస్థితుల్లో నెలల తరబడి కష్టపడి పరీక్ష రాసిన తర్వాత "ప్రశ్నపత్రం లీక్ అయింది... మళ్లీ పరీక్ష" అనే మాట వినడం ఎంత క్రూరమో పాలకులు ఎప్పుడైనా ఆలోచించారా?

నీట్ పరీక్ష రోజు దేశవ్యాప్తంగా కనిపించే దృశ్యాలు ఒక ప్రత్యేక సామాజిక వాస్తవాన్ని చెబుతాయి. తెల్లవారుజామునే పరీక్షా కేంద్రాల ముందు క్యూ లైన్లు మొదలవుతాయి. తల్లిదండ్రుల కళ్లలో ఆందోళన, పిల్లల ముఖాల్లో భయం, ఒత్తిడి, ఆశ, అన్ని కలిసి ఒక విచిత్రమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరీక్షా కేంద్రాల వద్ద జరిగే తనిఖీలు మరింత అవమానకరంగా ఉంటాయి. ఆడపిల్లల చెవికమ్మలు, ముక్కుపుడకలు, మెట్టలు, పట్టీలు, చేతి దారాలు, ఉంగరాలు, బొట్లు వరకు తీసేయిస్తారు. ఒకటి రెండు నిమిషాలు ఆలస్యమైతే గేట్లు మూసేస్తారు. ఏఐ ఆధారిత కెమెరాలు, జామర్లు, బయోమెట్రిక్ ధృవీకరణలు, కఠిన నిబంధనలు, ఇవి అన్నీ చూస్తే దేశ భద్రతకు సంబంధించిన ఆపరేషన్ జరుగుతున్నట్టే ఉంటుంది. కానీ ఇంత భారీ భద్రతా వ్యవస్థ మధ్య ప్రశ్నపత్రాలు వాట్సాప్ గ్రూపుల్లో తిరగడం, మాఫియా ముఠాలు ముందుగానే ప్రశ్నలు అమ్ముకోవడం చూస్తే అసలు ఈ నాటకం ఎవరి కోసం అన్న ప్రశ్న వస్తుంది.

ఇది ఒక్కసారిగా జరిగిన తప్పిదమైతే ప్రజలు క్షమించేవారు. కానీ ప్రతి ఏడాది ఇదే కథ పునరావృతమవుతోంది. ఒకసారి నీట్, మరోసారి యూజీసీనెట్, ఇంకోసారి జేఈఈ, మరొకసారి సీయూఈటీ... ఇలా దేశంలోని ప్రధాన ప్రవేశ పరీక్షలన్నీ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నాయి. ఎక్కడో ప్రశ్నపత్రం లీక్, ఇంకెక్కడో సర్వర్ డౌన్, మరెక్కడో మార్కుల లెక్కల్లో పొరపాట్లు, ఫలితాల ఆలస్యం, జవాబుల మార్పులు, ఇవి ఇప్పుడు విద్యార్థులకు సాధారణమైపోయాయి. పరీక్ష ఫలితాలకన్నా ముందే "లీక్ అయ్యిందట" అనే వార్తలు వస్తాయేమోనని భయపడే పరిస్థితి ఏర్పడింది. అంటే వ్యవస్థపై విశ్వాసం ఎంత దెబ్బతిన్నదో అర్థం చేసుకోవచ్చు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసింది. దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలకు ఒకే ప్రమాణం తీసుకొస్తామని, పారదర్శకత పెరుగుతుందని, విద్యార్థుల ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో నిష్పాక్షికంగా పరీక్షలు నిర్వహించే సంస్థగా దాన్ని అభివర్ణించారు. కానీ ఎనిమిదేళ్లు గడవకముందే ఆ ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు ఎన్టీఏ పేరు వినగానే విద్యార్థుల్లో నమ్మకంకన్నా అనుమానమే ఎక్కువగా కనిపిస్తోంది. ఒక సంస్థపై ప్రజల విశ్వాసం కోల్పోవడం కంటే ప్రమాదకరమైన విషయం మరొకటి లేదు. ముఖ్యంగా అది యువత భవిష్యత్తును నిర్ణయించే సంస్థ అయితే మరింత ప్రమాదం.

నీట్ పరీక్ష లక్ష్యం ఏమిటి? దేశవ్యాప్తంగా మెడికల్ విద్యలో ఒకే ప్రమాణం తీసుకురావడం. ముందు ప్రతి రాష్ట్రం, ప్రతి ప్రైవేట్ కళాశాల వేర్వేరు పరీక్షలు నిర్వహించేవి. విద్యార్థులు అనేక పరీక్షలు రాయాల్సి వచ్చేది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ గందరగోళానికి ముగింపు పలకాలని ఒకే పరీక్షను ప్రవేశపెట్టారు. ఆ ఆలోచనలో తప్పేమీ లేదు.




కానీ ఒకే పరీక్షపై దేశంలోని లక్షలాది మంది భవిష్యత్తు ఆధారపడే పరిస్థితి ఏర్పడినప్పుడు దాని నిర్వహణ అత్యంత విశ్వసనీయంగా ఉండాలి. అక్కడే ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా తలెత్తుతోంది. నిజంగా ఈ పోటీ పరీక్షల వ్యవస్థ సమాన అవకాశాలు కల్పిస్తోందా? సిద్ధాంతపరంగా చూస్తే అవును. కానీ ఆచరణలో పరిస్థితి వేరుగా ఉంది. కోచింగ్ పరిశ్రమ ఇప్పుడు వేల కోట్ల వ్యాపారంగా మారింది. హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, కలకత్తా బొంబాయి, వంటి నగరాలు కోచింగ్ కేంద్రాలుగా మారిపోయాయి. పేద కుటుంబాల పిల్లలు సాధారణ పాఠశాలల్లో చదివితే, డబ్బున్నవారు ప్రత్యేక కోచింగ్, ప్రత్యేక మెటీరియల్, ప్రత్యేక టెస్ట్ సిరీస్‌లతో ముందుకు వెళ్తున్నారు. "మెరిట్" అన్న పదం వెనుక భారీ ఆర్థిక అసమానత దాగి ఉంది. అయినా సరే, పరీక్ష న్యాయంగా జరిగితే కనీసం అందరికీ సమాన అవకాశమన్న భావన ఉండేది. ఇప్పుడు అది కూడా లేకుండా పోతే విద్యార్థులలో నిరాశ పెరగడం సహజం.

ప్రశ్నపత్రాల లీక్ వెనుక ఉన్న మాఫియా వ్యవస్థను తక్కువ అంచనా వేయలేం. ఇది చిన్న స్థాయి అవినీతి కాదు. కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే సంఘటిత నేర వ్యవస్థ. ప్రింటింగ్ నుంచి ప్యాకేజింగ్, రవాణా నుంచి నిల్వ వరకు ప్రతి దశలో లోపాలు ఉన్నాయని గత అనుభవాలు చెబుతున్నాయి. కొందరు అధికారుల సహకారం లేకుండా ఇలాంటి లీకులు సాధ్యం కావు. కానీ ప్రతి సారి కొన్ని అరెస్టులు చేసి, కొన్ని కమిటీలు వేసి, కొంతకాలం తర్వాత మళ్లీ అదే పరిస్థితి రావడం చూస్తే అసలు సమస్య మూలాల్లోనే ఉందని అర్థమవుతోంది.

ఇక్కడ ప్రభుత్వాల వైఖరి కూడా ప్రశ్నార్థకమే. పరీక్ష రద్దయిన తర్వాత "విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం" అని చెప్పడం సులభం. కానీ ప్రశ్న ఏమిటంటే ఈ పరిస్థితి రాకుండా ముందే ఎందుకు అడ్డుకోలేకపోయారు? అంత భారీ భద్రతా వ్యవస్థ ఉన్నప్పుడు వాట్సాప్‌లో వేలాది మందికి ప్రశ్నపత్రం ఎలా చేరింది? ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏమి చేసింది? దేశ భద్రత విషయంలో ప్రతి చిన్న సమాచారం సేకరించే ప్రభుత్వ యంత్రాంగం పరీక్షా లీకుల విషయంలో ఎందుకు విఫలమవుతోంది? ఇవి సాధారణ పరిపాలనా తప్పిదాలు కావు, ఇవి వ్యవస్థపరమైన వైఫల్యాలు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ఈ సంఘటనల ప్రభావం గురించి కూడా పెద్దగా చర్చ జరగడం లేదు. ఇప్పటికే పోటీ పరీక్షల ఒత్తిడి కారణంగా దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కోటా వంటి కోచింగ్ కేంద్రాల్లో ప్రతి సంవత్సరం జరిగే ఆత్మహత్యలు దేశాన్ని కలచివేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం, భవిష్యత్తుపై అనిశ్చితి పెరగడం యువతను మరింత మానసిక ఒత్తిడిలోకి నెడుతోంది. ఒక పరీక్ష కోసం సంవత్సరం మొత్తం శ్రమించిన విద్యార్థి మళ్లీ అదే స్థాయి ఏకాగ్రతతో సిద్ధమవ్వడం అంత సులభం కాదు. ముఖ్యంగా గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులకు ఇది తీవ్రమైన భారమే.

ఇది కేవలం విద్యార్థుల సమస్య మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. వైద్య విద్యలో ప్రవేశాలు అవినీతి, లీకులు, మోసాల చుట్టూ తిరిగితే భవిష్యత్తులో ఆరోగ్య రంగంపై దాని ప్రభావం పడకుండా ఉండదు. నిజంగా ప్రతిభ ఉన్న విద్యార్థులు అవకాశాలు కోల్పోతే దేశం నష్టపోతుంది. నకిలీ మార్గాల్లో సీట్లు సంపాదించే వారు పెరిగితే వైద్య వృత్తిపైనే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.

ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సమస్యను సాధారణ పరిపాలనా లోపంగా కాకుండా జాతీయ సంక్షోభంగా చూడాలి. మొదటగా ప్రశ్నపత్రాల ముద్రణ, రవాణా, భద్రతా వ్యవస్థ మొత్తం పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలి. ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్, బాధ్యత నిర్ధారణ ఉండాలి. ప్రైవేట్ కాంట్రాక్టర్లపై ఆధారపడటాన్ని తగ్గించాలి. సైబర్ భద్రతను బలోపేతం చేయాలి. పరీక్షా కేంద్రాల ఎంపికలో పారదర్శకత అవసరం. అవినీతి లేదా నిర్లక్ష్యం నిరూపితమైతే కఠిన శిక్షలు విధించాలి.

అంతకన్నా ముఖ్యంగా ఎన్టీఏ నిర్మాణంలోనే మార్పులు అవసరం. స్వతంత్ర నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులతో దాన్ని పునర్వ్యవస్థీకరించాలి. ప్రస్తుతం అది కేవలం పరిపాలనా సంస్థలా పనిచేస్తోంది. కానీ ఇంత పెద్ద బాధ్యత నిర్వహించాలంటే అత్యున్నత ప్రమాణాలు అవసరం. యూపీఎస్సీ స్థాయిలో స్వతంత్రత, బాధ్యత, నమ్మకం ఉండాలి.

ఇంకో కీలక అంశం పరీక్షా విధానం. ఒక్కరోజు, ఒక్క పరీక్షతో లక్షలాది మంది భవిష్యత్తు నిర్ణయించడం సరైన విధానమా అన్న చర్చ అవసరం. బోర్డు పరీక్షలు, నిరంతర మూల్యాంకనం, బహుళ దశల పరీక్షలు వంటి ప్రత్యామ్నాయాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. ఒక చిన్న తప్పిదం కూడా జీవితాన్ని ప్రభావితం చేసే విధంగా ఉన్న ప్రస్తుత వ్యవస్థలో ఒత్తిడి, అవినీతి, కోచింగ్ సంస్కృతి పెరగడం సహజం.

ప్రజాస్వామ్యంలో విద్య ఒక హక్కు. కానీ ఇప్పుడు అది పోటీ, ఒత్తిడి, వ్యాపారం, అవినీతి మధ్య చిక్కుకుపోయింది. మెడికల్ సీటు కోసం విద్యార్థి చేసే పోరాటం ఇప్పుడు జ్ఞానం కోసం కాకుండా వ్యవస్థతో యుద్ధంగా మారుతోంది. ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి. యువతలో వ్యవస్థపై నమ్మకం కోల్పోతే అది కేవలం విద్యారంగానికే కాదు, దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకూ ముప్పు.

నీట్ లీక్ ఘటన మరోసారి మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, పాలనలో నిబద్ధత లేకపోతే వ్యవస్థలు విఫలమవుతాయి. ఏఐ కెమెరాలు, జామర్లు, బయోమెట్రిక్స్, డిజిటల్ పర్యవేక్షణ, ఇవి కేవలం ప్రదర్శనలుగానే మిగిలిపోతాయి. నిజమైన భద్రత అంటే బాధ్యత, పారదర్శకత, నిజాయితీ. అవి లేకపోతే ఎంత పెద్ద వ్యవస్థ అయినా కూలిపోతుంది.

ఈ దేశ యువత ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారు. కానీ దేశంలోనే వారికి న్యాయమైన పరీక్షా వ్యవస్థ అందించలేకపోవడం అత్యంత విచారకరం. తల్లిదండ్రుల కన్నీళ్లు, విద్యార్థుల ఆందోళనలు, మానసిక ఒత్తిడి, ఇవి కేవలం వార్తల అంశాలు కాదు. ఇవి దేశ భవిష్యత్తు కేకలు. ప్రభుత్వాలు మారవచ్చు. విధానాలు మారవచ్చు. కానీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆగాలి. పరీక్షా లీకులు సాధారణ వార్తలుగా మారిపోయే పరిస్థితి ముగియాలి. ఒక విద్యార్థి పరీక్షా హాలులోకి వెళ్లేటప్పుడు "న్యాయంగా జరుగుతుంది" అన్న నమ్మకంతో వెళ్లాలి. అదే ప్రజాస్వామ్య బాధ్యత. అదే పరిపాలనా నైతికత. అదే దేశ భవిష్యత్తుకు కనీస హామీ.

నీట్ యూజీ 2026 రద్దు ఒక సంఘటన మాత్రమే కాదు, భారత విద్యా వ్యవస్థకు పడిన అద్దం. ఆ అద్దంలో కనిపిస్తున్న అవినీతి, నిర్లక్ష్యం, అసమర్థత, వ్యాపారీకరణను చూసి కూడా మార్పు రాకపోతే భవిష్యత్తు తరాలు మనలను క్షమించవు. లక్షలాది మంది విద్యార్థుల కలలు మళ్లీ మళ్లీ కూలిపోతున్నప్పుడు అధికార యంత్రాంగం నిర్లిప్తంగా ఉండటానికి హక్కు లేదు. ఇప్పుడు అయినా కేంద్ర లో ఉన్న బిజెపి ప్రభుత్వం మేల్కొని కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. లేకపోతే ప్రతి సంవత్సరం ఇదే ప్రహసనం కొనసాగుతుంది. పరీక్షలు రాసేది విద్యార్థులే అయినా... విఫలమవుతున్నది మాత్రం మొత్తం విద్య వ్యవస్థే అని పాలకులు గుర్తు ఎరగాలి.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

## "ఒక్కటవుదాం"

నిన్ను నీవు తెలుసుకొని
నన్ను నీవు తెలుసుకొని
నా దగ్గరికి రా...

నన్ను నేను తెలుసుకొని
నిన్ను నేను తెలుసుకొని ఇద్దరం ఒక్కటై..
మన మనసులను ఒక్కటి చేసి
సమాజం అరలోకి వెళ్ళుదాం

ఒక్కొక్కరి గుండె పొరలోకి దూరుదాం
చీకటి ముసుకునుచీల్చుకుంటూ..
గుండె చప్పుళ్లను వింటూ..
ఒకొక్క మానసిక తీరాలలో కెరటమై నిలబడుదాం

కొలతలకు అందని
కోరికలను లెక్క బెట్టూదాం
ప్రవహించే ఆశల సెలయేళ్లను కళ్లారా చూద్దాం

కడుపులో దాసుకున్న
నిజాల ఖాజానాలను చూద్దాం
హృదయంలో ఉదయించే ఊహలను పరిశీలిద్దా
ఒకొక్కరి అంతరంగాన్ని ఆవిష్కరించుదాం.

నిజమైన ఆత్మ సౌందర్యాన్ని మనసార చూద్దాం
నిద్రాణమై ఉన్నా నిజాలను నిద్ర లేపుదాం
ఉప్పొంగే అబద్ధాలను ఉరి బిగించుదాం


మనసు లోతులో
ఆర్ద్రత యెంతో తెలుసు కుందాం
పరవ శించే ప్రాశాంతత యెంతో అంచన వేదాం
కళ్ళలో ఉన్న స్వప్నాల గూళ్లను చూద్దాం
చూపుల వెనుకు ఉన్న రహస్యాలను పసి కట్టుదాం
ముడతల మడతాలలోని రాతలు పరిశీలించుదాం

ఆదిమ దశనుడి ఆధునిక దశ వరకు
జరిగిన పరిణామాలనుగమనించుదాం
పక్షపాత రహితంగా ప్రవర్తించుదాం
మార్పు ఆశించుదాం
గుండెలోపలి గదులను పరిశుభ్ర పరుచుదాం

ఘర్షణుల్ని సంఘర్షణుల్ని వదిలేసి స్వచ్ఛంగా ఉందాం
నీ శరీరం నుండి నీది కాని
శరీరంలోకి నిత్యం ప్రయాణం చేస్తూనే ఉన్నావు

నిజమైన నీ బతుకునువదిలి
ఎడారిలోకి జారిపోతున్నావు
నిజమైన దారి మరిచి పోతావు...!!

అంబటి నారాయణ
నిర్మల్
9849326801



# చింతపల్లి గూడ ప్రగతి వెంచర్ లోని చెన్నకేశవ ఆలయాన్ని పున నిర్మాణం చేయాలి

- **దళిత చైతన్య వేదిక రాష్ట్రవ్యవ స్థాపక అధ్యక్షుడు ఉక్కుల అశోక్**

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 14:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చింతపల్లిగూడ లో దళిత చైతన్య వేదిక రాష్ట్రవ్యవస్థాపక అధ్యక్షుడు ఉక్కుల అశోక్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని వెంటనే చింతపల్లిగూడ ప్రగతి వెంచర్ లోని చెన్నకేశవ ఆల యాన్ని పునర్నిర్మించాలని ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు శంషాబాద్ జోనల్ ఆదిభట్ల సర్కిల్ 54 వ కొంగర కలన్ డివిజన్ పరిధిలోని చింతపల్లిగూడ గ్రామం లోని ప్రగతి వెంచర్‌లో ఉన్న సుమా రు 100 సంవత్సరాల పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం కూల్చివేత ఘటన స్థానికంగా తీ వ్ర ఆందోళనకు దారితీసింది గ్రామస్థులు ఈఆలయాన్ని అత్యంత పవిత్రమైన దేవస్థానంగా భావి స్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తూ వచ్చారు కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ఈదేవాలయా నికి ప్రత్యేక గుర్తింపు



చింతపల్లి గూడ గ్రామంలో కూల్చి వేత గురైన చెన్నకేశవ ఆలయం

ఉందని గ్రామపెద్దలు తెలిపారుఅయితే వెంచర్ అభివృద్ధి వ్యాపార అవసరా ల పేరుతో కొంత కాలం క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆలయాన్ని కూల్చివేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు ఈ ఘటనతో గ్రామప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వెంటనే ఆల యాన్ని పుననిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారుఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లా డుతూ మా గ్రామదైవాన్ని కూల్చివేయడం బాధాకరం ఎన్నోసంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయా న్ని తిరిగి నిర్మించి భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి అని కోరారుదేవాలయం కూల్చివేత ఘటనను ఉ క్కుల అశోక్ తీవ్రంగా ఖండించారు గ్రామప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమా జంలో విభేదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు సంబంధిత అధికారులు స్పందించి ఆలయ పున నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు



దళిత చైతన్య వేదిక రాష్ట్రవ్యవస్థాపక అధ్యక్షుడు ఉక్కుల అశోక్


## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 14:

దుండిగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డి.పోచంపల్లి లోని బొంగునూరి కిషోర్ రెడ్డి తమ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కును,బాధిత కుటుంబ సభ్యులకు అత్యవసర చికిత్స కొరకు ఆరోగ్య శాఖ మంత్రి దూదిళ్ళ శ్రీధర్ బాబు ద్వారా,(సీఎంఆర్ఎఫ్) ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బౌరంపేట్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి సునీత కు,ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కొరకు ఆర్థికంగా లేకపోవడంతో,బాధిత కుటుంబ సభ్యులు బొంగునురి కిషోర్ రెడ్డి ని సంప్రదించగా, వారు వెంటనే స్పందించి, (సిఎంఆర్ఎఫ్) ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వారికి 60 వేల రూపాయల చెక్కును ,వైద్య ఖర్చులకు అందజేశారు.బాధిత కుటుంబ సభ్యులు,తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బికెఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుంది :డా. సత్యం శ్రీరంగం..



కూకట్ పల్లి మే 13 వెలుతురు:

తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమం, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. గురువారం నాగోల్ వసంత్ విహార్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బసవరాజ్ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ పదవి బాధ్యతల స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు స్టేట్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లారెడ్డి రాంరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్మ పరిరక్షణతో పాటు బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు సమాజంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రభుత్వ సహకారంతో మరిన్ని నిధులు సమీకరించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేసి సమాజ పురోగతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# చింతలకుంటలో ఘనంగా "నీత సారీస్ అండ్ స్టైల్స్" ప్రారంభం

ఎల్ బీ నగర్, వెలుతురు ప్రతినిధి, మే 14:

చింతలకుంట ఎస్‌బీఐ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "నీత సారీస్ అండ్ స్టైల్స్" షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వాహకురాలు నీత మాట్లాడుతూ.. తమ షాప్‌లో అతి తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల కొత్త డిజైన్ల సారీస్, డ్రెస్సులు, ఫ్యాన్సీ కలెక్షన్లు ప్రత్యేక ఆకర్షణగా






నిలుస్తాయని పేర్కొన్నారు.

పరిసర ప్రాంత ప్రజలు తమ షాప్‌ను ఆదరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సరసమైన ధరలు, నూతన డిజైన్లు తమ షాప్ ప్రత్యేకత అని తెలిపారు.

# కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బడిబాట కార్యక్రమం

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 14:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అ బ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖ మంత్రి గారు అలాగే జిల్లా విద్యాశాఖ అ ధికారి శ్రీ సుసింధర్ రావు గారి ఆదేశాల మేరకు బడిబాట కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల కోహెడలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి తిరుపతిబాయి గారు ఘనంగా ప్రారంభించారుఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయినులు విద్యార్థులు గ్రామ ప్రముఖులు మరి యు తెలంగాణసాహితీ సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు గ్రామంలో ర్యాలీనిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్యమెరుగైన సదుపాయాలు మరియు ప్రభుత్వ పాఠశాలల గొప్ప తనాన్ని ప్రజలకు వివరించారుఇటీవల పదవ తరగ తి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 540 మార్కులు సాధించిన విజయ కృష్ణ గారు




శివాని గారిని ఈసందర్భంగా అభినందించారు వారి విజయాన్ని గ్రామప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వ పా ఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అవగాహన కల్పించారు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాహితీ సంఘం సభ్యులు రాజు గారి ఆధ్వర్యంలో పాటలు నినాదాలు సౌండ్ సిస్టమ్ సహాయంతో గ్రామమంతా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారు ప్రభుత్వ పాఠ శాలలో విద్యార్థులకు అందుతున్న విశాలమైన ప్లే గ్రౌండ్ నాణ్యమైన మధ్యాహ్న భోజనం సైన్స్ ల్యాబ్ క్రమశిక్షణ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉత్తమ బోధన వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించారు అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు ఈసందర్భంగా ప్రధానోపాధ్యా యురలు శ్రీమతి తిరుపతిబాయిగారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తు కు బలమైన పునాది వేస్తున్నాయని తెలిపారు తెలంగాణ సాహితీ సంఘం సభ్యులు గ్రామ పెద్దలు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సాం ఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మరియు తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ మీలా విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమగ్ర అభివృ ద్ధి కలిగేలా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రతి తల్లిదండ్రి ప్రభుత్వ విద్యపై విశ్వా సం పెంచుకోవాలని కోరారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధా మాధవి మేడం గోపాల్ రెడ్డి కొండయ్య లక్ష్మణ్ అమర్ సింగ్ గణేష్ బన్సీలాల్ వెంకటేష్ అక్బర్ తదితరులు పాల్గొన్నారువి ద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవం తంచేశారు

## బడిబాటను విజయవంతం చేద్దాం ప్రభుత్వ బడుల గొప్పతనాన్ని చాటి చెప్పుదాం

- **టీఎస్ యుటిఎఫ్ మంచాల మండలం అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్**



మంచాల వెలుతురు మే 14:

మంచాల మండలం కేంద్రంలో టీఎస్ యుటిఎఫ్ మండలం అధ్యక్షుడు డాక్టర్ ఆజ్మత్ ఖాన్ మాట్లడుతూ ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి బస్తి ప్రతి గ్రామంప్రతి పట్టణంలో బ డి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి పాఠశాల వయస్సుగల ప్రతి బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు విద్యఅనేది ప్రతి చిన్నారి హక్కుఅని సమాజంలోని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన అన్నారు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరు నా మాలుగా నిలుస్తున్నాయని తెలిపారు ప్రభుత్వపాఠశాలల్లో అర్హత అనుభవం గల ఉపాధ్యాయు లు పనిచేస్తూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉత్తమ బోధన అందిస్తున్నారని అన్నారు ప్ర భుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజు సన్నబియ్యంతో రుచికరమైన మధ్యాహ్నభోజనం అం దిస్తున్నారని వారానికి మూడుసార్లు గుడ్లు అందజేస్తున్నారని తెలిపారు అదేవిధంగా ఉచిత పాఠ్య పుస్తకాలు రెండు జతల యూనిఫాంలు ఇంగ్లీష్ బోధనపై ప్రత్యేక శ్రద్ధఆకర్షణీయమైన తరగతి గదు లు వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారుఎస్సీఎస్టీ బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారాస్కాలర్షిప్‌లు అందుతున్నాయని చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తర గతులువ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు గ్రంథాల యా లు డిజిటల్ బోధన ఉచిత ఆరోగ్య పరీక్షలు క్రీడా మైదానాలు వంటి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశా లలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని అన్నారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులు పూర్వవిద్యార్థులు అందరూ కలిసి బడి బాట కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు

## ఘనంగా డా. పిడమర్తి రవి జన్మదిన వేడుకలు...



- **వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ, అన్నప్రసాదం పంపిణీ చేసిన చిరుమర్తి రాజు..**

కూకట్ పల్లి మే 13 వెలుతురు:

తెలంగాణ ఉద్యమ రథసారథి, రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిడమర్తి రవి జన్మదిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్ల పంపిణీతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వృద్ధులతో మమేకమై వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా చిరుమర్తి రాజు మాట్లాడుతూ, డా. పిడమర్తి రవన్న తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మల్లేష్, విఠల్, పోశాల రాజు, ఆంజనేయులు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాల ప్రభుత్వ స్థల పరిశీలన

- **కండ్లకోయలో సర్వేనెంబర్ 135 136 లో గల స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మన చౌదరి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 14(వెలుతురు):

మేడ్చల్ మండలంలోని కండ్లకోయలో గల 135, 136 సర్వే నంబర్లలోని ప్రభుత్వ స్థలాన్ని గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. కోర్టు కాంప్లేక్స్, డిస్ట్రిక్ట్, సబ్ రిజిస్ట్రేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కేటాయించడానికి 12 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కాంప్లేక్సుకు గాను 5 ఎకరాలు, రిజిస్టరేషన్ ఆఫీసులకు 3 ఎకరాలు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు గాను 4 ఎకరాలు కేటాయించడం జరిగిందని అందుకు గాను స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ల్యాండ్ డెవలప్మెంట్ కు గాను టెండర్ పిలుస్తామన్నారు. ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్, మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, మేడ్చల్ డిప్యూటి కమీషనర్ సుధాంశు, తదితరులు పాల్గొన్నారు.

# జన గణన – 2027 లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 14:

జన గణన - 2027 లో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియలను కలెక్టర్ సి నారాయణ రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేయాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏ ఒక్క కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు.

ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న ఇంటిని దగ్గరుండి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, కందుకూర్ తహశీల్దార్, ఎంపిడిఓ, సంబంధిత శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ భూలక్ష్మి ఆయలాభివృద్ధికి ఎమ్మెల్యే దానం చేయూత





- గాంధీ బస్తి సమీపంలోని ఆలయానికి నిధులు
- దేవాలయ మరమ్మత్తులకు సహకారం
- సొంత నిధుల నుంచి రూ.3 లక్షల మంజూరు
- కాంట్రాక్టర్‌కు రూ.1 లక్ష అడ్వాన్స్ చెల్లింపు
- ప్రత్యేక పూజలతో పనుల ప్రారంభం
- పాల్గొన్న మాజీ కార్పొరేటర్

**మహాలక్ష్మి రామన్ గౌడ్**

వెలుతురు, హైదరాబాద్ మే 14:

గ్రేటర్ హైదరాబాద్ హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గాంధీ బస్తి సమీపంలో ఉన్న పురాతన శ్రీ భూలక్ష్మి అమ్మవారి దేవాలయ అభివృద్ధికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేయూతనందించారు. దేవాలయానికి పెయింటింగ్‌తో పాటు ఇతర మరమ్మత్తుల పనులు చేపట్టాలని బస్తివాసులు, దేవాలయ కమిటీ సభ్యులు కోరడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆలయ సుందరీకరణ, పెయింటింగ్, మరమ్మత్తుల పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా గురువారం రోజున కాంట్రాక్టర్‌తో మాట్లాడి రూ.1 లక్ష అడ్వాన్స్‌గా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షిస్తూ హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

హిమాయత్‌నగర్ డివిజన్‌లో దేవాలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని స్థానికులు అభినందించారు. ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాల అభివృద్ధి పనులు చేపడుతుండటం ఆనందంగా ఉందని బస్తివాసులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు శివ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, ఎతిరాజ్, ప్రియరాజ్, ఓం ప్రకాష్, జైస్వాల్, జాకీ, అఖిల్, కొండయ్య, రాజేందర్ గౌడ్, నదీమ్, సుధాకర్, ఐలమ్మ, కళ, వేణు తాతలు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 2.58 లక్షల డ్రగ్స్ పట్టివేత..




- ఎం డి ఎం ఏ, ఓ జి కుష్, చెరస్ డ్రగ్స్ ను స్వాధీనం.
- కారుతోపాటు ఇద్దరి అరెస్ట్..

బషీర్బాగ్ వెలుతురు 13 మే :

బడా బాబుల పిల్లల కు డ్రగ్స్ అమ్మకాలు జరిపి భారీగా సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ బి టీం ఇద్దరు ఎస్ఐలు సిబ్బంది కలిసి అరెస్ట్ చేశారు. సూరారం కొంపెల్లి హై టెన్షన్ రోడ్ లో డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు, సంధ్య లతో పాటు పక్కా సమాచారం మేరకు ఇనోవా కారును గుర్తించి నిలిపి తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో కారులో ఉన్న ప్రవీణ్ వద్ద బెంగళూరు నుంచి కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన 3.24 యం డి యమ్ ఏ డ్రగ్సును, ఎలిజర్ అలియాస్ సన్నీ వద్ద 36.90 ఓ జి కుష్ 7.73 గ్రాముల చెరస్ ను స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్స్ తో పాటు టవేటో కార్ ను కూడా సీజ్ చేశారు.పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ. 2.58 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.నిందితులను డ్రగ్స్ ను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.

# వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



కందుకూర్ మండలం వెలుతురు మే 14:

గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివరాలు నమోదు చేసే రిజిస్టర్ పరిశీలించారు. వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులను, టార్ఫలిన్ లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ పర్యటనలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్, మార్క్ ఫెడ్ అధికారి, మండల వ్యవసాయ అధికారి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ జాతి కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధం

- మాదిగ మహాశక్తి పోస్టర్ ను ఆవిష్కరణ కార్యక్రమంలో మోత్కుపల్లి

హైదరాబాద్, మే 14 (వెలుతురు) :

మాదిగ సామాజిక వర్గం అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేస్తున్న తన మీద హత్య ప్రయత్నం జరిగిందని, మాదిగ జాతి కోసం ప్రాణం త్యాగం చేసేందుకు తాను సంసిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మాదిగ జాతి ఓట్లు మాదిగ నాయకులకు వేసినప్పుడే మాదిగ జాతి సమగ్ర అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మాదిగ జాతి ప్రజలు అగ్రవర్ణాలకు ఓటు బ్యాంకుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మాదిగ జాతి ఓటును సక్రమంగా వినియోగించుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దళిత ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మాదిగ మహా శక్తి అనే చైతన్య సంస్థను నెలకొల్పారు. అందుకు సంబంధించిన జెండాను, పాటల సీడిని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాదిగ మహాశక్తి కార్యక్రమాన్ని మోత్కుపల్లి మాదిగ మహాశక్తి జెండా ముందు మిగిలిన రాజకీయ జెండాలు మట్టికరవాలని అన్నారు. మాదిగ మహాశక్తి జెండాలోని మూడు రంగులు కష్టాలకు, తిరుగుబాటుకు, ప్రేమకు చిహ్నాలని మోత్కుపల్లి తెలిపారు. జెండాలోని నీలం రంగు కన్నీళ్లు, కష్టాలకు గుర్తులని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడా ఇదే నీలి రంగును ఎంచుకుని చరిత్ర సృష్టించారని అన్నారు. ఇక పసుపు రంగు మాదిగ జాతికి చిరునామా అని, పసుపు రంగు తంగేడుపువ్వులా పవిత్రతకు, శుభాలకు గుర్తుగా ఉంటుందన్నారు. ఎరుపు రంగు విప్లవానికి, పరాక్రమానికి, పోరాటాలని చిహ్నమని, దశాబ్దాలుగా మాదిగ జాతి చేస్తుంది అదే పోరాటమని గుర్తు చేసారు. మూడు అద్భుత సందేశాలిచ్చే మాదిగ మహాశక్తి జెండా తెలంగాణలో ప్రతీ మాదిగ సోదరుడి ఇంటి మీద రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం 28 మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు పోటీ చేయాల్సిందేనని, ముగ్గురు మాదిగ అభ్యర్థులు లోక్ సభకు పోటీ చేసి తీరాల్సిందే నన్నారు. మాదిగ ప్రజల ఓట్లు మాదిగ నాయకులకే వేస్తే రాజ్యాధికారం తప్పకుండా సిద్దిస్తుందని పేర్కొన్నారు. మాదిగ జాతిని గౌరవించి సముచిత స్థానం కల్పించిన రాజకీయ పార్టీలతోనే కలిసి నడుస్తామన్నారు. మాదిగ, మాలలకు సమాన హక్కులను స్వర్గీయ ఎన్టీఆర్ కల్పించారన్నారు. మాల, మాదిగ ఇద్దరూ ఎన్నికల పోటీలో ఉంటే మాదిగ జాతి ప్రజలు మాదిగ అభ్యర్థికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్ లోక్ సభ ఎన్నికల్లో మల్లు రవికి మాదిగలందరూ ఓటు వేస్తేనే గెలిచారని గుర్తు చేశారు. చుండూరు ఊచకోతకు బలైన మాలల తరుపున పోరాడి, ఏడు రోజులు శాసనసభను స్థంభింప చేసానని, మాలలకు న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహరణ దీక్ష చేస్తానని ఆనాడు ప్రభుత్వాన్ని హెచ్చరించానన్నారు. చుండూరు బాధితులకు న్యాయం జరగాలని ఆనాడు ఉమ్మడి రాష్ట్రం మొత్తం పర్యటించానని గుర్తుచేశారు. ఐనప్పటికీ భట్టి విక్రమార్క గానీ, వివేక్ వెంకటస్వామి గానీ, మల్లు రవి గానీ ఎవ్వరూ తనకు సంఘీభావం తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, వెలమ సామాజిక వర్గాలు చాలా వృద్ధిలోకి వచ్చాయని, మాదిగ జాతిలో కూడా చైతన్యం రావాల్సి ఉందన్నారు. రేవంత్ రెడ్డి తాను తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేసామని, కానీ రేవంత్ రెడ్డి అవకాశాలను అందిపుచ్చుకుని సీఎం అయ్యాడని, చిన్న కులంలో పుట్టిన తాను వెనకబడిపోయానని ఆందోళన వ్యక్తం చేశారు. ఐనప్పటికి వెకడుగు వేసేది లేదని, మాదిగ జాతిలో చైతన్యం వస్తే రాజ్యాధికారం తప్పదన్నారు. పవన్ కళ్యాణ్ చూసి కాపు సామాజిక వర్గం ఏకం ఐనట్టు మాదిగ మహాశక్తి ద్వారా మాదిగలందరూ ఏకం కావాలన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి మాదిగ ఇంటి మీద మాదిగ మహాశక్తి జెండా ఎగరాలన్నారు. మాదిగ జాతి ఇకనైనా ఐక్యంగా పోరాడాలని, మాదిగ జాతికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు సీనియర్ అడ్వకేట్ సగరపు ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# మాది రైతు పక్షపాతి ప్రభుత్వం





- **రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొంటాం.**
- **ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నాం.**
- **4600 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో వేశాం**
- **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెల్లడి.**

**నల్లగొండ జిల్లా వెలుతురు మే 14:** దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న అనంతరం అక్కడే రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గడచిన రెండున్నర సంవత్సరాలలో అత్యధికంగా వరి పండించిన కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు .ప్రతి రైతుకు మద్దతు ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 22 వేల కోట్ల రూపాయలను చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రబీలో 65 లక్షల ఎకరాలలో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు. అందులో 80 నుండి 90 లక్షలు మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేయనుందని, ధాన్యం కొనుగోలుకై 18.67 కోట్ల గన్ని బ్యాగులను పిపిసి సెంటర్లకు పంపించినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రతి సెంటర్తో పాటు, మండల ,నియోజకవర్గ స్థాయిలో అధికారులను నియమించామని ,ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల వాహనాలను వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లకు విస్తృత అధికారాలు కల్పించామని ,రాష్ట్రవ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోలుకు 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ,ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని,4600 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగిందని, రానున్న రెండు, మూడు రోజుల్లో మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపించడం జరుగుతుందని,అలాగే 3000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయనున్నామని చెప్పారు. మూడు లక్షల 84,000 మంది రైతుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ జిల్లాకు సంబంధించి ఐదు లక్షల 46000 ఎకరాల్లో 14 లక్షల 65 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం పండిందని,ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నల్గొండ జిల్లాలో 7 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, నల్గొండ జిల్లాలోనే 456 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ,కోటి 22 లక్షల గన్ని బ్యాగులు ఇచ్చామని, 53,611 మంది రైతులకు మద్దతు ధర చెల్లించి 692 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, రెండు, మూడు రోజుల్లో మరో 400 కోట్లు రైతుల ఖాతాలలో ట్రాన్స్ఫర్ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 1000 వాహనాలను రబీ ధాన్యంకై ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు పండించిన ధాన్యాన్ని ఎంఎస్పీ చెల్లించి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ధాన్యం సేకరణలో పశ్చిమబెంగాల్ కూలీలను నియోగిస్తున్నందున అక్కడ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా హమాలీల సమస్య ఉత్పన్నమైందని ,తరుగు, తాలు విషయంలో మిల్లర్లు ,ట్రేడర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1800 మిల్లులు ఎంఎస్పి ఆపరేషన్ లో పాల్గొంటున్నాయని, 12 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఇంటర్మీడియట్ గోదాం సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని ,అంతేకాక నిర్దేశించిన సమయంలో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని, ట్రాన్స్పోర్ట్ ,హమాలి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఈసారి పెద్ద ఎత్తున పంట వచ్చిందని, రైతులకు కష్టం కలగకుండా రైతుల చెంతకే వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఈ రబీలో నల్గొండ జిల్లాలో అత్యధిక ధాన్యం పండిందని ,గతం తో పోలిస్తే 30000 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా పండినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడిన హమాలి, ట్రాన్స్పోర్ట్ సమస్యను పరిష్కరించడం జరిగిందని , బుధవారం ఒక్కరోజే నల్గొండ జిల్లాలో 19000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు. ఏ ఎంఆర్పి కాలువల లైనింగ్ కోసం 450 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరుగుతున్నదని, ఎస్ఎల్ బి సి సొరంగం పూర్తయితే జిల్లాలో మరింత దాన్యం దిగుబడులు పెరుగుతాయి అన్నారు .లారీలు అవసరం ఉంటే మరిన్ని వినియోగించాలని, ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో లారీలు అవసరం ఉన్న కొనుగోలు కేంద్రాలకు ముందుగా పంపించాలని చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్ పి శరత్చంద్ర పవర్ ,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రామ్ పతి నాయక్, డిఎస్ఓ వెంకటేశం, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు మంత్రుల వెంట ఉన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ ని నిరసిస్తూ జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం






- **మోడీ చేతకానితనంతోనే నీట్ పేపర్ లీకేజ్**
- **విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిజెపి ప్రభుత్వం**
- **యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్**

**భువనగిరి మే, 14 (వెలుతురు న్యూస్ ):** కేంద్ర బిజెపి ప్రభుత్వ అసమర్థత ప్రధాని నరేంద్ర మోడీ చేతగానితనంతోనే నీట్ పరీక్ష పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ అన్నారు. ఈరోజు ఇటీవల జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమవుతూ ముఖ్యంగా డబుల్ ఇంజన్ సర్కారు అని చెప్పుకుంటూ డబుల్ టైం పేపర్ లీకేజీ చేస్తూ పూర్తిగా దేశ పాలనలు తుంగలో తొక్కి రాజకీయాలకు ప్రాధాన్యతమిస్తూ కక్ష సాధింపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశంలో అల్లా కల్లోలం సృష్టించాలనే లక్ష్యంతో పని చేస్తూ పరిపాలనలో విఫలమయ్యారని, ప్రశ్నించిన వారిపై మోడీ అమిత్ షాలు సిబిఐ ఈడిఐటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతున్నారని అన్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు పేపర్ లీకేజీలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ అధ్యక్షులు బద్దం వాసుదేవ రెడ్డి, మంగ కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుమేకల మహేష్ యాదవ్, చేకూరి బాలు, బట్టు సందీప్,NSUI అసెంబ్లీ అధ్యక్షులు బొల్లెపల్లి వినయ్, ప్రధాన కార్యదర్శి ఎండి అసద్, మసూద్, జియాద్దీన్, జలీల్, అబేద్, జిల్లా యువ నాయకులు పోత్నూక్ సన్నీ, వరుణ్, జాలిగాం శివ, ఏశాబోయిన శివ, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన లో భాగంగా ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తి వివరాలను అందించి సహకరించాలి



- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్లగొండ వెలుతురు మే 14:** 2027 జనగణనలో భాగంగా ఈ నెల 11 నుండి ప్రారంభమైన గృహ గణన సందర్భంగా గురువారం ఎన్యుమరేటర్లు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి రాగా జిల్లా కలెక్టర్ తన పూర్తి వివరాలను ఎన్యుమరేటర్లకు అందజేశారు. జనగణనలో భాగంగా ముందుగా స్వీయ గణన పూర్తయిందని, ఈ నెల 11 నుండి గృహ గణన బ్లాక్ లిస్టింగ్ ప్రారంభం అయిందని, కాగా గురువారం తన క్యాంపు కార్యాలయానికి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు రాగా, 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలన్నింటిని సమర్పించినట్లు ఆయన తెలిపారు. జన గణనలో భాగంగా ఎన్యుమరే టర్లు ప్రతి ఇంటికి వచ్చి వివరాలను సేకరిస్తారని, అందువలన జిల్లాలోని పౌరులందరూ 33 ప్రశ్నలకు సంబంధించిన పూర్తి వివరాలను అందించి జనగణన త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకారం అందించాలని కోరారు. జనగణన దేశ అభివృద్ధికి ఉపయోగపడుతుందని, వివిధ రకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర ఉన్నారు.

## తోటి క్లాస్మేట్ కూతురి వివాహానికి అండగా 2001/02 విద్యార్థులు




42 వేల 603 రూపాయలు అందజేత

మునుగోడు వెలుతురు మే 14 : మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 02 సంవత్సరంలో 10 వ తరగతి పూర్తి చేసుకున్న ఎండి సహేద ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ కూతురు వివాహం చేస్తుంది..సమస్యను తెలుసుకున్న తోటి విద్యార్థులు తమకు వీలు అయినంత మేర మొత్తం 42603 రూపాయలు జమ చేశారు. గురువారం రోజు మునుగోడు మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్ లో జరిగిన సహేద కూతురి వివాహంలో కుటుంబసభ్యుల సమక్షంలో 42603 రూపాయలు అందజేసి మానవత్వం చాటుకున్నారు.ఈ సందర్భంగా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.. ఆపదలో మేము ఉన్నాం అంటూ ఆదుకున్నా తోటి విద్యార్థులకు సహేద, కృతజ్ఞతలు తెలిపారు..ఆపదలో పేదింటి ఆడపిల్ల వివాహానికి తమ వంతుగా సహాయం అందించడం అభినందనీయం అని, అండగా నిలిచిన 2001 / 02 విద్యార్థులను పలువురు ప్రశంసించారు..ఈ కార్యక్రమములో పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు,ఈద ప్రవీణ్, శ్రవణ్,గాలి సైదులు,జానీబేగం,శంకరమ్మ, శ్యామల,శాంతి పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గోగుల గోపి స్వామి – శివాని పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం

**నార్కట్ పల్లి వెలుతురు మే 14:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోగుల గోపి స్వామి - శివాని దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆత్మీయులు మొగుళ్ళ సాయి, భవ్య ఆధ్వర్యంలో "మనం స్వచ్ఛంద సంస్థ"లో నిత్య ఉచిత భోజన కార్యక్రమం 555వ రోజున అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిరుపేదలు, నిస్సహాయులు, బిక్షాటన చేసేవారు, బాటసారులకు అన్నదానం నిర్వహించారు. గోగుల గోపి స్వామి అనేక కుటుంబాల్లో వెలుగులు నింపిన గురువులని, వారి పేరుమీదుగా అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. మొగుళ్ళ సాయి భవ్య మాట్లాడుతూ, "మా జీవితంలోని ప్రతి ముఖ్యమైన రోజును నిరుపేదల ఆకలి తీర్చేందుకు వినియోగించాలనుకుంటాము. ఈ సృష్టిలో ఆకలికంటే పెద్ద లోటు మరొకటి ఉండదని మా కుటుంబం నమ్ముతుంది. ఆకలితో ఎవరూ బాధపడకూడదనేదే మా ఆకాంక్ష" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దైద నాగరాజు, గుంటూరి ఈశ్వర్‌రావు, తాడోజు విక్రమ్ చారి తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ బంగారం చోరీ కేసులో కీలక పురోగతి






- ముగ్గురు అరెస్టు, ముఠా అంతర్జాతీయ తరహా నెట్‌వర్క్‌పై దృష్టి
- నగల దుకాణంలో 161 తులాల బంగారం,
- 112 క్యారెట్ల వజ్రాభరణాల దోపిడీ చేసిన ముఠా
- మొత్తం 13 మంది నిందితులు ఈ దోపిడీలో భాగస్వాములు
- ముగ్గురు నిందితుల అరెస్టు చేసినట్లు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం
- దోపిడీకి ముందు ధర్మపురిలో ముఠా సభ్యుల ఆశ్రయం
- చోరీ తర్వాత మూడు బృందాలుగా విడిపోయి పరారీ యత్నం
- రైలు, బస్సు మార్గాల ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితులు
- రూ.51 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడి
- ముఠా ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్‌గా గుర్తింపు
- బీహార్, బెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఇదే ముఠా చోరీలు

**కరీంనగర్ వెలుతురు మే 14:**
కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన బంగారం చోరీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. అత్యంత ప్రణాళికాబద్ధంగా జరిగిన ఈ దోపిడీ కేసులో ఇప్పటివరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. కరీంనగర్‌లోని ఒక నగల దుకాణాన్ని లక్ష్యంగా చేసుకుని మొత్తం 13 మంది నిందితులు ఈ దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. దొంగతనం సమయంలో 161 తులాల బంగారం, 112 క్యారెట్ల వజ్రాభరణాలను అపహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ చోరీ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసుల విచారణలో ముఠా ముందస్తుగా పక్కా ప్రణాళికతోనే ఈ దోపిడీకి సిద్ధమైనట్లు తేలింది. చోరీకి ముందు నిందితులు ధర్మపురి ప్రాంతంలో తాత్కాలికంగా ఆశ్రయం పొందినట్లు గుర్తించారు. అక్కడే వారు తమ కదలికలను సమన్వయం చేసుకుని, లక్ష్యాన్ని ఖరారు చేసుకున్నారని పోలీసులు తెలిపారు. దోపిడీ అనంతరం నిందితులు వెంటనే ఒకే బృందంగా కాకుండా మూడు వేర్వేరు గ్రూపులుగా విడిపోయి పరారయ్యారు. పోలీసుల దర్యాప్తును తప్పించుకునేందుకు ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. వాహనాలను ధర్మపురి వద్దే వదిలిపెట్టి, అక్కడి నుంచి రైలు, బస్సు వంటి ప్రజా రవాణా మార్గాల ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, లోకేషన్ ట్రాకింగ్ ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.51 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొబైల్ ఫోన్లలో ఉన్న డేటా ఆధారంగా మిగతా సభ్యుల కదలికలపై కూడా పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలక పరిణామంగా, దోపిడీ సొత్తును కొనుగోలు చేసిన ఒక బంగారం వ్యాపారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన ఆభరణాలను మార్కెట్‌లోకి తీసుకురావడంలో అతడి పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో మనీ ట్రయిల్, హ్యాండ్లింగ్ నెట్‌వర్క్‌ను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ముఠా ప్రధాన సూత్రధారిగా సుబోధ్ సింగ్‌ను పోలీసులు గుర్తించారు. అతడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ వివిధ రాష్ట్రాల్లో దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. బీహార్, బెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే ముఠా ఇలాంటి చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. కరీంనగర్‌లో దోపిడీకి ముందు సుమారు రెండు నెలలపాటు ముఠా రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో పరిశీలనలు చేసి, భద్రతా వ్యవస్థలు, కదలికలు, సమయాలను అధ్యయనం చేసిన తర్వాతే నగల దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు గుర్తించారు. ఈ తరహా పెద్ద స్థాయి దోపిడీ తెలంగాణలో ఇదే తొలిసారి అని పోలీసులు పేర్కొన్నారు. ముఠా అంతర్జాతీయ తరహా విధానాలను అనుసరించిందని, ప్రతి దశలోనూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పరారీలో ఉపయోగించిన వేర్వేరు మార్గాలు, బృందాల విభజన వంటి అంశాలు దర్యాప్తు అధికారులను ఆశ్చర్యానికి గురి చేశాయి. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు రాష్ట్రం అంతటా, అలాగే ఇతర రాష్ట్రాల్లోనూ గాలిస్తున్నాయి. త్వరలోనే మిగతా సభ్యులను కూడా అరెస్టు చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేసును పూర్తిగా ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సీపీ గౌస్ ఆలం స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీకేజీపై యూత్ కాంగ్రెస్ ఆందోళన

- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన.. మోడీ దిష్టిబొమ్మ దగ్ధం...
- కేంద్రం వైఫల్యంతో 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని విమర్శ...



**జహీరాబాద్ వెలుతురు, మే 14 :**
నీట్ యూజీ-2026 పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ నీట్ యూజీ-2026 పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి సిద్ధమవుతున్న పరీక్షల్లో ఇలాంటి లీకేజీలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించిన వారు, గతంలో 2021 మరియు 2024 సంవత్సరాల్లో కూడా జరిగిన పేపర్ లీకేజీ ఘటనల నుంచి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రస్తుతం పేపర్ లీకేజీలకు కేంద్రాలుగా మారాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి లీకేజీ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ బబ్లూ, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రేమ్ సింగ్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, సోహేల్, మండల అధ్యక్షులు రాఘవేందర్, సునీల్, ప్రధాన కార్యదర్శులు మోహిన్ తదితరులతో పాటు నాయకులు సంతోష్ రెడ్డి, ఖాదర్, కార్తీక్, అక్బర్, అభిలాష్ మరియు భారీ సంఖ్యలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి టిఆర్ఎస్ లోకి భారీగా చేరికలు

**వెలుతురు నారాయణఖేడ్ మే 14 :**
సంగారెడ్డి జిల్లా : హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో గల తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ బాపు మల్ శెట్టి అధ్యక్షత నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ కాంగ్రెస్,బీజేపీ , బి ఆర్ ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు గ్రామ స్థాయి నుండి వివిధ మండలాల వారు దాదాపు 40 వాహనాల్లో 300 మంది టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత చేతుల మీదుగా టిఆర్ఎస్ కండువాలు కప్పుకొని టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి కవిత గారు మాట్లాడుతూ 1200 మంది అమరుల పునాదుల ఉద్యమకారుల రెక్కల కష్టం మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదని ముఖ్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గం లోని నాయకుల నిర్లక్ష్యం వల్ల నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనకకు నెట్టి వేయబడ్డ ప్రాంతంగా తయారైందని,ఇక్కడ ఉపాదిలేక తమ ఇళ్లను కుటుంబాలను వదిలి వలసలు వెళ్లి బతుకులు వెళ్ల దీస్తున్నారని అన్నారు,ఇక్కడి నాయకులు పరిశ్రమలు ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావన్నారు, ఇప్పటివరకు నారాయణఖేడ్ నియోజకవర్గంలో అగ్రకులాల వారే అధికారం చేలాయించడం జరిగిందని నారాయణఖేడ్ నియోజకవర్గంలో బిసి, ఎస్సీ , ఎస్టి వారే అధికంగా 90%ఉన్నారని ఇక్కడ బడుగుబలహీన వర్గాల వారికి టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు వారికే టిఆర్ఎస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం బాపు మల్ శెట్టి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ లోని పాంచ జన్యం అంశాలకు ఆకర్షితులమై కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ లో ప్రజలకు ఉచిత విద్య ,వైద్యం, యువతకు ఉపాధి ,ఉద్యోగ అవకాశాల రూపకల్పన వంటి వాటికి ఆకర్షణీయమై కవితక్క మీద పూర్తి విశ్వాసంతో






టిఆర్ఎస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు,నారాయణఖేడ్ లో టిఆర్ఎస్ పార్టీని పటిష్టపరిచేందుకు కృషిచేస్తానని అన్నారు. టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేతుల మీదుగా బాపు మంజుల మల్ శెట్టి జడ్పిటిసి కంటెస్టెడ్,శంకర్ యాదవ్ ఓయూ జెఏసి జనరల్ స్టూడెంట్ జేఏసీ నాయకులు,సాయి తేజ ముదిరాజ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు,సుమన్ పాటిల్ హట్కర్ సమాజ్ అధ్యక్షులు,ప్రశాంత్ లింగాయత్ సమాజ్ నాయకులు,విట్టల్ చారి ఎంపీటీసీ ర్యాకల్,మాణిక్యం ముదిరాజ్ తెలంగాణ ఉద్యమ నాయకులు,సురేష్ ఎంపీటీసీ పైడిపల్లి,లింగారెడ్డి సర్పంచ్ భోర్గి, భీమయ్య ముదిరాజ్ ఆర్ టి డి ఎస్ ఐ ,బాబురావు పాటిల్,మోహన్ నాయక్ ఎస్టి సెల్ నాయకులు,ఎండి కయ్యూమ్ మైనారిటీ సెల్ నాయకులు,రమేష్ నాయక్ నాగ్ గొండ, రుక్మిణి,రేఖ తదితరులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ఆడపడుచు వివాహానికి కనుక అందజేసిన కౌన్సిలర్ మొహమ్మద్ నయ్యర్ జాఫర్



- కుటుంబ సభ్యులకు 20 వెయ్యిల నగదు, క్వింటల్ బియ్యం అందజేత...

**జహిరాబాద్ వెలుతురు మే 14:**
34 వ వార్డులో సంక్షేమం, అభివృద్ధి ఏకకాలంలో చేసి వార్డును సమూలంగా అభివృద్ధి చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని 100 శాతం అమలు చేస్తమని కౌన్సిలర్ మొహమ్మద్ నాయ్యర్ జాఫర్ అన్నారు. ఇటీవల జరిగిన పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోనీ శాంతి నగర్ లో భాగమైన 34 వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేసిన మొహమ్మద్ నయ్యర్ జఫర్ వార్డు వాసులకు ఎన్నికల్లో విజయం సాధిస్తే వార్డు ఆడపడుచు వివాహానికి కానుకగా క్వింటల్ బియ్యం, 20 వెయ్యిల నగదు సాయన్ని అందిస్తానని ఇచ్చిన మాటను విజయం సాధించిన తొమ్మిదవ రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మొహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీ చేస్తూ విజయం సాధించిన అనంతరం వార్డుకి చెందిన నిరుపేద ఆడపడుచుల వివాహానికి 20 వెయ్యిల నగదు సాయం, క్వింటల్ బియ్యం ఇస్తామని చెప్పడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారమే విజయం సాధించిన తదుపరి మాటను నీలు పూకున్నామని, రాబోయే ఐదు సంరాల పాటు ఇది కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మొహమ్మద్ నిసార్, మొహమ్మద్ ఆమెర్, కాలనీ వాసులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేత



- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం....

**జహీరాబాద్ వెలుతురు, మే 14 :**
దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్‌యూజీ 2026 పరీక్షను ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థలో వరుసగా జరుగుతున్న నిర్లక్ష్యాలు, పేపర్ లీకులు విద్యార్థుల నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారని, వారంతా నెలల తరబడి తీవ్ర శ్రమతో సిద్ధమై పరీక్షలు రాశారని తెలిపారు. అయితే ప్రభుత్వ అసమర్థత, పరీక్షా నిర్వహణలో జరిగిన లోపాల కారణంగా పరీక్షను రద్దు చేయడం విద్యార్థులకు తీవ్ర మానసిక వేదన కలిగించడమే కాకుండా వారి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపిందన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ సెంటర్లకు భారీ మొత్తాలు ఖర్చు చేసి, ఎన్నో ఆశలతో పరీక్షలకు సిద్ధమయ్యారని, ఇప్పుడు పరీక్ష రద్దుతో వారు తీవ్ర నిరాశలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షా నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, ప్రశ్నాపత్రాల భద్రతలో విఫలం కావడం వంటి అంశాలు దేశ విద్యా వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలు తరచూ పునరావృతం కావడం వల్ల విద్యార్థులలో పోటీ పరీక్షలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకువచ్చి, పూర్తిస్థాయి పారదర్శకతతో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

## బడిబాటతో విద్యార్థుల చేరికలకు ఊతం




- ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత వివరించిన ఉపాధ్యాయులు

**సిరిసిల్ల వెలుతురు మే 14:**
సిరిసిల్ల టౌన్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న 'బడిబాట' కార్యక్రమం గురువారం సిరిసిల్ల పట్టణంలోని ఎంపీపీ ఎస్ భూపతి నగర్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. గీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తల్లిదండ్రులను కోరారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి చిన్నారికి విద్య హక్కు అని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్



బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా విద్య అందుతున్నదని వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు బి. గీత మాట్లాడుతూ విద్యార్థుల హాజరు పెంపుతో పాటు డ్రాప్‌అవుట్‌లను తగ్గించడమే బడిబాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు రావాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉపాధ్యాయుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా మారుతున్నాయని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పాఠశాలలో అందుతున్న విద్యా ప్రమాణాలను ప్రజలకు వివరించారు. స్థానికులు కార్యక్రమాన్ని అభినందించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తెలిపారు.

# నీట్ పేపర్ లీక్ కేసులో నకిలీ డాక్టరే సూత్రధారి

- సీబీఐ విచారణలో దిమ్మతిరిగే వాస్తవాలు వెల్లడి
- పేపర్ లీక్ కేసులో దూకుడు పెంచిన సీబీఐ
- నిందితుల నెట్‌వర్క్ గుట్టురట్టు
- విద్యార్థుల నుంచి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వసూలు
- నాసిక్‌లో 'నకిలీ డాక్టర్' శుభం ఖైర్నార్ అరెస్ట్
- పేరుకే డాక్టర్, క్లాసులకు వెళ్లని వైనం
- ప్రశ్నపత్రాన్ని రూ.15 లక్షలకు పీడీఎఫ్ రూపంలో అమ్మకం
- రాజస్థాన్, బీహార్ సహా పలు రాష్ట్రాలకు లీకైన పేపర్
- నిందితుల ఆర్థిక లావాదేవీలపై నజర్
- నెట్‌వర్క్ మూలాలను వెతుకుతున్న అధికారులు



**న్యూఢిల్లీ వెలుతురు మే 14:**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతంలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఈ భారీ కుంభకోణాన్ని ఛేదించే పనిలో ఉన్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులకు దిమ్మతిరిగే నిజాలు తెలిశాయి. లీకైన పేపర్‌ను విద్యార్థులకు చేరవేసేందుకు నిందితులు ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో కీలక నిందితుడిగా భావిస్తున్న మహారాష్ట్రకు చెందిన శుభం ఖైర్నార్‌ను సీబీఐ అరెస్ట్ చేయగా, అతడి నేపథ్యం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. నాసిక్‌లో 'డాక్టర్' అని బోర్డు తగిలించుకుని, ఒక ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నడుపుతున్న శుభం, అసలు ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదని తేలింది. కేవలం అడ్మిషన్ తీసుకుని, అప్పటి నుంచి అటువైపు కన్నెత్తి చూడలేదని, కనీసం పరీక్షలు కూడా రాయలేదని ఆ యూనివర్సిటీ వర్గాలు ధ్రువీకరించాయి. ఇలాంటి 'నకిలీ డాక్టర్' వేలమంది విద్యార్థుల భవిష్యత్తును తన స్వార్థం కోసం తాకట్టు పెట్టడం గమనార్హం. ఈ లీకేజీ నెట్‌వర్క్ ఎంత పకడ్బందీగా సాగిందో సీబీఐ విచారణలో స్పష్టమైంది. తొలుత రాజస్థాన్‌లో వెలుగుచూసిన ఈ వ్యవహారం వెనుక నాసిక్ సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శుభం ఖైర్నార్ ఈ ప్రశ్నపత్రాన్ని తనకు తెలిసిన ఒక వ్యక్తి దగ్గర రూ. 10 లక్షలకు కొనుగోలు చేసి, ఆ తర్వాత దానిని పీడీఎఫ్ ఫైల్‌గా మార్చి గురుగ్రామ్‌లోని మరో వ్యక్తికి రూ. 15 లక్షలకు విక్రయించాడు. అక్కడి నుండి ఈ పేపర్ వాట్సప్ ద్వారా రాజస్థాన్, బిహార్, జమ్మూకశ్మీర్, కేరళ వంటి రాష్ట్రాలకు సెకన్ల వ్యవధిలో పాకిపోయింది. మరోవైపు రాజస్థాన్‌కు చెందిన యశ్ యాదవ్, వికాస్ బీవాల్ వంటి నిందితులు ఈ పేపర్‌ను హార్డ్ కాపీగా స్కాన్ చేసి, దానిపై విద్యార్థులకు అర్థమయ్యేలా చేతితో రాసి కోచింగ్ సెంటర్లకు పంపిణీ చేశారు. ఈ విచారణలో భాగంగా పలు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల యజమానులను కూడా సీబీఐ ప్రశ్నిస్తోంది. లీకైన పేపర్‌ను చూసేందుకు తాము భారీగా నగదు చెల్లించామని పలువురు విద్యార్థులు అధికారుల ఎదుట అంగీకరించడం గమనార్హం. దర్యాప్తు సంస్థల కళ్లు గప్పేందుకు నిందితులు వేసిన ఎత్తుగడలు సినిమా ఫక్కీలో సాగాయి. పేపర్ లీక్ వ్యవహారం బయటపడి పోలీసులు నిందితుల కోసం వేట మొదలుపెట్టగానే, ప్రధాన నిందితుడు శుభం ఖైర్నార్ పరారయ్యాడు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు తన వేషధారణను మార్చుకుని, గుండు చేయించుకుని తిరిగాడు. అయితే డిజిటల్ ఆధారాలను సేకరించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో అతడి జాడను కనిపెట్టి మంగళవారం అరెస్ట్ చేశారు. అతడితో పాటు అతడి సోదరుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం సీబీఐ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ నిందితులను విచారిస్తోంది. పేపర్ మొదటగా ఎక్కడ లీక్ అయింది? ప్రెస్ నుండి బయటకు వచ్చిందా లేక తరలింపు సమయంలో ఎక్కడైనా చోరీకి గురైందా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు ఎక్కడి నుంచి ఎక్కడికి సాగాయో తెలుసుకునేందుకు బ్యాంక్ అకౌంట్లను కూడా పరిశీలిస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న ఈ 'లీక్ గ్యాంగ్' వెనుక ఇంకా ఎవరైనా పెద్ద తలకాయలు ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది.

# ఏపీకి రెయిన్ అలర్ట్ బంగాళాఖాతంలో అల్పపీడనం



- కోస్తా, రాయలసీమలో వర్ష సూచన
- నైరుతి బంగాళాఖాతం సమీపంలో సుస్పష్ట అల్పపీడనం కొనసాగుతున్నట్లు
- విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడి
- అదే ప్రాంతంలో 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు సమాచారం
- రాబోయే 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో వర్షా లు
- ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం
- గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే సూచన
- నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ అంచనా
- ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశం
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచన
- తీర ప్రాంతాల్లో వాతావరణ మార్పులు వేగంగా చోటు చేసుకునే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా వర్ష పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని సమాచారం

అమరావతి వెలుతురు మే 14:
నైరుతి బంగాళాఖాతం-పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీప ప్రాంతంలో సుస్పష్ట అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అదే ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 5.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాం ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తీర ప్రాంతాలు, తక్కువ ఎత్తు ప్రాంతాల్లో గాలి వేగం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం చురుగ్గా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్-నికోబార్ దీవులను రుతుపవనాలు తాకే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. తీర ప్రాంత ప్రజలు వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలని కూడా హెచ్చరికలు జారీ చేశారు. మొత్తంగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా వచ్చే రెండు రోజులు వర్షాలకు దారితీసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# ఢిల్లీలో వారానికి రెండ్రోజులు వర్క్ ఫ్రం హోమ్

- ఇంధన పొదుపు దిశగా కీలక చర్యలు
- వారానికి రెండు రోజులు వర్క్‌ఫ్రమ్ హోమ్ అమలు
- ప్రధాని మోదీ పిలుపు నేపథ్యంలో నిర్ణయం
- ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజుల వర్క్‌ఫ్రమ్ హోమ్
- 'నో వెహికల్ డే' అమలు సహా పలు పొదుపు చర్యలు
- 50 శాతం అధికారిక సమావేశాలు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- సీఎం రేఖా గుప్తా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గింపు
- ప్రభుత్వ వాహనాల్లో పెట్రోల్, డీజిల్ కోటా 20 శాతం తగ్గింపు
- ఆరు నెలల వరకు కొత్త వాహనాల కొనుగోలుపై నిషేధం
- మంత్రులకు సోమవారం మెట్రో ప్రయాణం తప్పనిసరి సూచన
- ఉద్యోగుల ప్రయాణ భత్యం 10 శాతం పెంపు నిర్ణయం



**ఢిల్లీ వెలుతురు మే 14:**
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన ధరలపై ఒత్తిడి పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపుకు అనుగుణంగా ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ యంత్రాంగంలో ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు పలు పరిమితులు, కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా గురువారం మీడియా సమావేశంలో ఈ నిర్ణయాలను వెల్లడించారు. ఈ మార్పులు శుక్రవారం నుంచే అమల్లోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే సీఎం రేఖా గుప్తా తన అధికారిక కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను నాలుగుకు తగ్గించగా, వాటిలో రెండు విద్యుత్ వాహనాలుగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగులు వారానికి రెండు రోజులపాటు ఇంటి నుంచే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వ శాఖల్లో జరిగే అధికారిక సమావేశాల్లో కనీసం 50 శాతం సమావేశాలు ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలన్న సూచనను ప్రభుత్వం జారీ చేసింది. ఇది ప్రయాణ అవసరాన్ని తగ్గించి ఇంధన వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ వాహనాల వినియోగాన్ని తగ్గించే ఉద్దేశంతో మంత్రిత్వ శాఖల అధికారులు ప్రతి సోమవారం మెట్రోలో ప్రయాణించి కార్యాలయాలకు రావాలని సూచించారు. దీనికి ప్రోత్సాహంగా ఉద్యోగుల ప్రయాణ భత్యాన్ని 10 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా అధికారిక వాహనాలకు కేటాయించే పెట్రోల్, డీజిల్ నెలవారీ కోటాను 20 శాతం తగ్గించారు. అలాగే వచ్చే ఆరు నెలల పాటు కొత్త వాహనాల కొనుగోలును నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా ఒక సంవత్సరం పాటు మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలకు వెళ్లరాదని మార్గదర్శకాలు జారీ చేశారు. అదేవిధంగా మూడు నెలల పాటు భారీ స్థాయి ప్రభుత్వ కార్యక్రమాలు, ఆర్భాట కార్యక్రమాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజా రవాణాను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వ సిబ్బంది నివసించే 29 కాలనీలకు 58 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ఇంధనాన్ని ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లో మార్పులు తీసుకురావాలని కూడా ఢిల్లీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. కార్యాలయాల్లో రద్దీని తగ్గించి ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించాలన్నది ఈ నిర్ణయాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. మొత్తంగా, అంతర్జాతీయ ఇంధన సంక్షోభ ప్రభావాల నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు పరిపాలనా వ్యవస్థలో పెద్ద మార్పులకు దారితీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# కలకత్తా హైకోర్టుకు మమతా బెనర్జీ హాజరు



- పోస్ట్ పోలింగ్ హింస కేసు విచారణలో ప్రత్యక్ష వాదనలు
- కలకత్తా హైకోర్టులో పోస్ట్ పోలింగ్ హింస కేసు విచారణ
- స్వయంగా వాదనలు వినిపించిన మాజీ సీఎం
- పిటిషన్ దాఖలు చేసిన శిర్షన్య. సీనియర్ నేత కల్యాణ్ బందోపాధ్యాయ్ కుమారుడు
- తృణమూల్ కాంగ్రెస్ ఎక్స్‌లో కోర్టు హాజరు దృశ్యాల ప్రచారం
- మమతా నిబద్ధతకు నిదర్శనమని టీఎంసీ వ్యాఖ్య
- బెంగాల్ ప్రజల కోసం ఎప్పుడూ అండగా ఉంటారని పార్టీ పోస్టు
- ద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా మమతా పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య

**పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 14:**
పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కలకత్తా హైకోర్టుకు నల్ల కోటు ధరించి హాజరయ్యారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణలపై దాఖలైన కేసు విచారణ సందర్భంగా ఆమె స్వయంగా కోర్టులో వాదనలు వినిపించనున్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది కల్యాణ్ బందోపాధ్యాయ్ కుమారుడు శిర్షన్య పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హైకోర్టులో విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది. మమతా బెనర్జీ కోర్టుకు హాజరవుతున్న దృశ్యాలను తృణమూల్ కాంగ్రెస్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పంచుకుంది. ఈ సందర్భంగా పార్టీ ఆమెను నిబద్ధతకు ప్రతీకగా అభివర్ణించింది. టీఎంసీ పోస్టులో, "బెంగాల్ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో మమతా బెనర్జీ అండగా నిలుస్తారు. సత్యం, న్యాయం, రాజ్యాంగ విలువల కోసం ఆమె నిరంతరం పోరాడుతారు. ద్వేషపూరిత రాజకీయాలకు అతీతంగా నిలబడి, కరుణ, ధైర్యం, దృఢ విశ్వాసాన్ని ప్రదర్శిస్తారు" అని పేర్కొంది. అంతేకాకుండా, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీరుపై పరోక్ష విమర్శలు చేస్తూ, అన్యాయ చర్యలు, అనాగరిక రాజకీయాలను ఆమె బలంగా వ్యతిరేకిస్తారని టీఎంసీ పేర్కొంది. గతంలోనూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విచారణకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ స్వయంగా వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి హైకోర్టులో ప్రత్యక్షంగా హాజరుకావడం రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పోస్ట్ పోలింగ్ హింస కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఆస్ట్రేలియా హైకమిషనర్‌తో కేటీఆర్ కీలక భేటీ

- పెట్టుబడులు, ఐటీ సహకారంపై విస్తృత చర్చ
- కేటీఆర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం
- ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ పాల్గొన్న భేటీ
- కర్ణాటక, తెలంగాణ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ హాజరు
- పరస్పర పెట్టుబడుల అవకాశాలపై విస్తృత చర్చ
- ఐటీ రంగంలో సహకారంపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ టెక్ ఎకోసిస్టమ్‌పై కేటీఆర్ వివరణ
- గ్రీన్ ఎనర్జీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు
- విద్యా రంగంలో కొత్త ఒప్పందాలపై చర్చ

**హైదరాబాద్ వెలుతురు మే 14:**
కల్వకుంట్ల తారక రామారావుతో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ అయ్యారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఇరుపక్షాల మధ్య పరస్పర సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్తో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ కూడా సమావేశంలో పాల్గొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా




పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ముఖ్యంగా ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారంపై ఇరుపక్షాలు చర్చించాయి. హైదరాబాద్ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకోసిస్టమ్‌పై హైకమిషనర్ బృందానికి కేటీఆర్ వివరించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ తీసుకుంటున్న చర్యలను కేటీఆర్ వివరించినట్లు సమాచారం. విద్యారంగంలో కొత్త భాగస్వామ్యాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. భారత్-ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. యువతకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా ఈ భాగస్వామ్యం కీలకంగా మారుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ భేటీ ద్వారా భవిష్యత్తులో తెలంగాణ-ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తమైంది. సమావేశం అనంతరం కేటీఆర్ ఈ చర్చలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# స్వామినాథన్ కమిషన్ సిఫారసులను బుట్టదాఖలు చేసిన కేంద్ర ప్రభుత్వం

- పెరిగిన సాగు వ్యయాలకు ఏమాత్రం సరిపోని ధరలు
- రైతుల ఆదాయాన్ని పెంచే సంకల్పం కేంద్రానికి కనిపించడం లేదు
- రైతు సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మంత్రి ఆగ్రహం
- MSP ప్రకటించడం కాదు, ఆ ధరకు కొనుగోలు చేయడమే అసలు రైతు సంక్షేమం
- ప్రతి పంటలో కనీసం 75 శాతం దిగుబడిని కేంద్రం కొనుగోలు చేయాలి
- మొక్కజొన్న, జొన్నలను వెంటనే PSS పరిధిలోకి తీసుకురావాలి
- రైతుల శ్రేయస్సు కోసం మొక్కజొన్న, జొన్న పంటలను కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కొనుగోళ్లతో ఏటా 4000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం



**హైదరాబాద్ వెలుతురు మే 14:** 2026-27 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (MSPలు) రైతుల ఆశలను పూర్తిగా నీరుగార్చాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. మినాథన్ కమిషన్ స్పష్టంగా సూచించినట్లుగా, "సంపూర్ణ ఉత్పత్తి వ్యయం (C2)పై కనీసం 50 శాతం లాభం కలిపి MSP నిర్ణయించాలి" అనే మూల సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి తుంగలో తొక్కిందని మంత్రి మండిపడ్డారు. రైతుల కోసం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో మాత్రం రైతులను మోసం చేస్తోందని ఆయన అన్నారు.

**వరి MSP - పేరుకు మాత్రమే పెంపు**

సాధారణ వరి MSPను క్వింటాల్‌కు ₹2,441గా నిర్ణయించడం ద్వారా గత ఏడాదితో పోలిస్తే కేవలం ₹72 మాత్రమే పెంచారని మంత్రి తెలిపారు. ఇది కేవలం 3 శాతం పెరుగుదల మాత్రమేనని, ఎరువులు, కార్మిక చార్జీలు, విత్తనాలు, డీజిల్, విద్యుత్ ఖర్చులు భారీగా పెరిగిన పరిస్థితుల్లో ఈ పెంపు రైతులకు ఏమాత్రం ఉపశమనం కలిగించదని పేర్కొన్నారు. "రైతు వెన్నెముకతో దేశ ఆర్థిక వ్యవస్థ నడుస్తుంటే, వరి MSPలో ₹72 పెంపుతో రైతులను ఊరడించాలనుకోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని మంత్రి వ్యాఖ్యానించారు.

**మొక్కజొన్న MSP – రైతుల పట్ల కపట ప్రేమకు నిదర్శనం**

మొక్కజొన్న MSPను క్వింటాల్‌కు ₹2,410గా నిర్ణయించి కేవలం ₹10 మాత్రమే పెంచారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఇది 0.4 శాతం పెరుగుదల మాత్రమేనని, ఇంత స్వల్ప పెంపును రైతు అనుకూల నిర్ణయంగా ప్రచారం చేయడం కేంద్ర ప్రభుత్వ కపట ప్రేమకు పరాకాష్ట అని అన్నారు. "రైతులకు పదిరూపాయలు ఇచ్చి వందల రూపాయల ప్రచారం చేసుకోవడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటైపోయింది" అని మంత్రి ఘాటుగా విమర్శించారు.

**కందిపప్పు MSP – రైతు వ్యయాలకు సరిపోని పెంపు**

కందిపప్పు MSPను క్వింటాల్‌కు ₹8,450గా నిర్ణయించి ₹450 పెంచినప్పటికీ, పప్పు ధాన్యాల సాగులో పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు, తెగుళ్ల ముప్పు, మార్కెట్ అనిశ్చితి దృష్ట్యా ఇది తగిన పెంపు కాదని మంత్రి అభిప్రాయపడ్డారు.

***పత్తి MSP – తెలంగాణ రైతులకు పూర్తిస్థాయి న్యాయం కాలేదు***

తెలంగాణలో ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తికి MSPను క్వింటాల్‌కు ₹8,267గా నిర్ణయించారు. ₹557 పెంపు జరిగినప్పటికీ, పత్తి సాగులో ఎకరాకు అయ్యే భారీ పెట్టుబడి, కూలీల కొరత, పురుగుమందుల వ్యయం, దిగుబడి అనిశ్చితి దృష్ట్యా రైతులకు ఇది సరిపోదని మంత్రి తెలిపారు.

**వేరుశెనగ, సోయాబీన్ MSPలు కూడా నిరాశాజనకం**

వేరుశెనగ MSPను ₹7,517గా నిర్ణయించి కేవలం 3.5 శాతం పెంచడం, సోయాబీన్ MSPను ₹5,708గా నిర్ణయించి 7.1 శాతం పెంచడం కూడా రైతుల ఆశించిన స్థాయిలో లేవని మంత్రి పేర్కొన్నారు.

**MSPల పేరుతో ప్రచారం – రైతుల చేతికి మాత్రం తక్కువ లాభం**

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం MSPలను పెంచుతున్నామని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, రైతుల నిజమైన ఆదాయంలో పెరుగుదల కనిపించడం లేదని మంత్రి అన్నారు. ఒకవైపు ఉత్పత్తి వ్యయాలు రెట్టింపవుతుండగా, మరోవైపు MSP పెంపులు నామమాత్రంగా ఉండటం రైతులకు తీవ్ర అన్యాయం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**స్వామినాథన్ కమిషన్ అమలు ఎక్కడ?**

ఎన్నికల సమయంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేసిందని మంత్రి విమర్శించారు.

**రైతుల ఆదాయ భద్రత కోసం MSPలను 30–40 శాతం పెంచాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు నిజమైన గిట్టుబాటు ధరలు కల్పించాలంటే MSPలను కనీసం 30-40 శాతం వరకు పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. సంపూర్ణ ఉత్పత్తి వ్యయాల ఆధారంగా MSPలు నిర్ణయించి, రైతులకు చట్టబద్ధమైన ధర హామీ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

**కనీసం 75 శాతం పంటను కేంద్రం కొనుగోలు చేయాలి**

అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరలు (MSP) కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఆ ధరలకే ఆయా పంటలను కేంద్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్నట్లుగా ఎకరానికి నిర్దిష్ట శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతుల పట్ల అన్యాయమని ఆయన పేర్కొన్నారు. రైతు ఎంత కష్టపడి పండించిన పంటకు కనీసం 75 శాతం మేర కేంద్ర ప్రభుత్వం హామీతో కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. MSP ప్రకటించి కొనుగోలు బాధ్యత నుంచి తప్పించుకోవడం రైతులను మోసం చేయడమేనని మంత్రి విమర్శించారు.

**మొక్కజొన్న, జొన్నలను PSS పరిధిలోకి తీసుకురావాలి**

ప్రత్యేకంగా తెలంగాణలో విస్తృతంగా సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వ ధర మద్దతు పథకం (Price Support Scheme PSS) పరిధిలోకి తీసుకువచ్చి, MSP ధరకు కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ పంటలను PSSలో చేర్చకపోవడం వల్ల రైతులు మార్కెట్‌లో దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయని పంటలను రైతు శ్రేయస్సే పరమావధిగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చి కొనుగోలు చేస్తోందని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, జొన్న పంటలను కూడా మద్దతు ధరకు సేకరించి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కొనుగోళ్ల ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు ₹4,000 కోట్ల అదనపు భారం భరిస్తోందని ఆయన వెల్లడించారు. "MSP ప్రకటించడం ఒక్కటే రైతుకు మేలు కాదు. ఆ ధరకు పంటను కొనుగోలు చేసినప్పుడే MSPకు అసలు అర్థం ఉంటుంది. లేకపోతే అది రైతులను మభ్యపెట్టే ప్రకటనగానే మిగిలిపోతుంది" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది?



- కేంద్రం తీరుపై సుప్రీంకోర్టు ప్రశ్న
- ప్రజాస్వామ్యం ఎక్కడుందని జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్న

**న్యూఢిల్లీ వెలుతురు మే 14:** సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియపై కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల ఎంపిక విధానంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, కేంద్ర క్యాబినెట్ మంత్రి సభ్యులుగా ఉన్న కమిటీ నియామకాలపై నిర్ణయం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నియామక ప్రక్రియ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టే ఎన్నికల సంఘం నియామక కమిటీలో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించింది. అయితే ప్రధాన న్యాయమూర్తినే కమిటీలో ఉండాలని తాము చెప్పడం లేదని, కనీసం ఒక స్వతంత్ర సభ్యుడు అయినా ఉండాల్సిన అవసరం లేదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్నికల సంఘం స్వతంత్రత కేవలం వ్యవస్థలోనే కాకుండా ప్రజలకు కూడా స్పష్టంగా కనిపించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణిను ప్రశ్నిస్తూ.. ప్రధానమంత్రి ఒక అభ్యర్థిని సూచిస్తే, ప్రతిపక్ష నేత మరో వ్యక్తిని సూచించే అవకాశం ఉంటుందని, అటువంటి పరిస్థితిలో మూడో సభ్యుడైన క్యాబినెట్ మంత్రి ప్రతిపక్ష నేతకు మద్దతు ఇచ్చే అవకాశాలు ఎంతవరకు ఉంటాయని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అటార్నీ జనరల్ మాట్లాడుతూ, ప్రతి సందర్భంలో ఒకే విధంగా వ్యవహారం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. అయితే ప్రధానమంత్రి నిర్ణయానికి క్యాబినెట్ మంత్రి వ్యతిరేకించే అవకాశాలు చాలా తక్కువగా ఉండటంతో 2:1 మెజారిటీతో నిర్ణయం జరిగిపోతుందని జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. ప్రస్తుత వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర కేవలం 'అలంకారప్రాయం'గా మారిపోయిందని ధర్మాసనం పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే నియామక ప్రక్రియ పారదర్శకంగా, సమతుల్యంగా ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది.

## తాటి నీరా బాటిల్ లను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ వెలుతురు మే 14:** మే 24 వ తేదీన జరిగే "టాడీ మ్యూజికల్ ఫెస్టివల్ ఎక్స్‌పీరియమ్" తాటి కల్లు మేళా పై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అవగాహన కార్యక్రమం కార్యక్రమంలో తాటి నీరా బాటిల్ లను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న,మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, తదితరులు... మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ రూట్ లో రాందేవ్ గారు 150 ఎకరాల్లో 500 కోట్ల రూపాయలతో ఎక్స్ పీరియం పార్క్ ఏర్పాటు చేశారు.. మే 24 వ తేదీనవివిధ దేశాల నుండి తెచ్చిన 500 తాటి చెట్లు 10 కోట్ల రూపాయలతో చెట్లను ఎక్స్ పీరియం పార్క్ లో ఏర్పాటు చేస్తున్నారు..ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారి సూచనల మేరకు ఆరోజు జరిగే కార్యక్రమం పై ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం.. అక్కడ మే 24 న టాడీ మ్యూజికల్ ఫెస్టివల్ ఎక్స్‌పీరియమ్" తాటికల్లు మేళా ఏర్పాటు చేస్తున్నారు.. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమంలో పాల్గొనడానికి రాందేవ్ గారి ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చాం.. కల్లు ఆరోగ్యానికి మంచిది.. మేజర్ హోటల్ లలో కూడా అందుబాటులో ఉండేలా చేస్తాం..తెలంగాణ డ్రింక్ గా తాటి కల్లు చేయాలని వారు కోరారు..ప్రభుత్వంలో చర్చిస్తాం..తాటి కల్లు ప్రకృతి రీత్యా దొరుకుతుంది.. ఆరోగ్యానికి చాలా మంచిది.. సైంటిఫిక్ ఆధారాలు ఉన్నాయి.. తాటి ఈత వనాలు పెంచుకునే వారు మే 24 వ తేదీన జరిగే "టాడీ మ్యూజికల్ ఫెస్టివల్ ఎక్స్‌పీరియమ్ కార్యక్రమంలో పాల్గొనాలి. ఈజీఎస్ కింద రాష్ట్ర వ్యాప్తంగా తాటి ఈత వనాలు నాటి పెంచుతున్నాం.. గ్రామాల్లో నర్సరీ లలో తాటి ఈత మొక్కలు పెంచాలి.. ఇది ప్రకృతి సిద్ధమైన డ్రింక్.. కిడ్నీ లో రాళ్ళు వచ్చిన అవి తగ్గడానికి ఆరోగ్యంగా ఉంటుంది.. మనసు ఉల్లాసానికి, ఆరోగ్యానికి తాటి కల్లు అమృతం లాగ పని చేస్తుంది.. గీతావృత్తి బతకాలి.. ఆరోగ్యంగా ఉండాలి..నేచర్ కాపాడాలి..

## ధాన్యం సేకరణలో ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించం



- ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొనుగోళ్లపై మంత్రుల సమీక్ష
- అన్ని రకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలి
- హమాలీల కొరతను స్థానిక కూలీలతో భర్తీ చేయాలి
- పది రోజుల పాటు అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి
- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద అదనపు అధికారుల నియామకం
- ట్రాన్స్పోర్ట్, హమాలీ సమస్యలపై ప్రజాప్రతినిధుల ఆందోళన
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థన
- మిల్లుల్లో నిల్వ సమస్యలపై దేవరకొండ ఎమ్మెల్యే ఆందోళన
- బాలాజీ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రులు

**నల్లగొండ జిల్లా వెలుతురు మే 14:** ధాన్యం సేకరణలో ట్రాన్స్పోర్ట్ లారీ కాంట్రాక్టర్లు ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి హెచ్చరించారు. లారీల సమస్యను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్లు అన్ని రకాల వాహనాలను ధాన్యం సేకరణకు మళ్లించాలని సూచించారు. హమాలీల కొరతను అధిగమించేందుకు స్థానిక కూలీలను వినియోగించాలని ఆదేశించారు. గురువారం ఉమ్మడి నల్గొండ జిల్లా ధాన్యం సేకరణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లుభవనాలుసినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు. రబీ ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, రానున్న పది రోజుల పాటు అన్ని రకాల లారీలు, వాహనాలను వినియోగించాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. హమాలీలు, లారీల సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తే ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్, మిర్యాలగూడ ప్రాంతాల్లో సన్నధాన్యం ఎక్కువగా వస్తుండటంతో అక్కడ సమస్యలు లేవని తెలిపారు. నల్గొండ, నకిరేకల్, దేవరకొండ, తుంగతుర్తి ప్రాంతాల్లో ధాన్యం అధికంగా రావడంతో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అత్యవసర సేవల శాఖలు మినహా మిగతా శాఖల అధికారులను కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద నియమించాలని సూచించారు. ఎక్కువ లారీలు అవసరమైన కేంద్రాలను గుర్తించి అక్కడికి అదనపు వాహనాలను పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం లారీల వినియోగాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యే మందుల సామెల్ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, మిల్లర్లు గ్రేడ్ తగ్గించి రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నీటి ప్రభావంతో గట్టితాలు ఎక్కువగా వస్తున్నాయని, దీంతో మిల్లర్లు కొనుగోళ్లకు విముఖత చూపుతున్నారని తెలిపారు. జిల్లాకు బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. రైతులు ఆన్లైన్‌లో 100 బ్యాగుల వరకు బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలోని మిల్లులు ఇప్పటికే ధాన్యంతో నిండిపోయాయని, కొత్తగా వచ్చే ధాన్యానికి నిల్వ సౌకర్యం కల్పించాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ట్రాన్స్పోర్ట్ సమస్యను పరిష్కరించి, వ్యవసాయ శాఖ అధికారులను కూడా వినియోగించాలని సూచించారు. అంతకుముందు మంత్రులు నల్గొండ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి మిల్లు యజమానులు, హమాలీలతో మాట్లాడారు. బీహార్ నుంచి వచ్చిన హమాలీలు, కార్మికులు రోజుకు 10 నుంచి 15 లారీలు అన్‌లోడ్ చేస్తున్నట్లు మంత్రులకు తెలిపారు. జిల్లాలో ధాన్యం అధికంగా వస్తున్నందున మరింత సహకరించాలని మంత్రులు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గుండెకు వేకువ గండం!



రాత్రీ పగలూ, ఇంటా బయటా.. గుండెపోటు ఎప్పుడైనా, ఎక్కడైనా రావొచ్చు. తీవ్ర ఒత్తిడికి, భావోద్వేగాలకు గురైనప్పుడూ దాడి చేయొచ్చు. దీనికి వేళాపాళా అంటూ ఏమీ లేదు. అయితే తెల్లవారుజామున, ఉదయం పూట ఎక్కువగా వస్తుండటం విచిత్రం. ఒక పరిశోధన ప్రకారం రాత్రి 11 గంటల కన్నా ఉదయం 9 గంటల సమయంలో గుండెపోటు వచ్చే అవకాశం మూడు రెట్లు ఎక్కువ. ఇందుకు రకరకాల అంశాలు కారణమవుతుంటాయి.

- **హార్మోన్ల అస్తవ్యస్తం**

నిద్రలో శరీరం విశ్రాంతి స్థితిలో ఉంటుంది. ఉదయం మెలకువ వచ్చే సమయంలో శరీరాన్ని సన్నద్ధం చేయటానికి అడ్రినలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల మోతాదులు పెరుగుతుంటాయి. చురుకుగా, అప్రమత్తంగా ఉండటానికి తోడ్పడే ఇవి గుండె వేగం, రక్తపోటు పెరిగేలా చేస్తుంటాయి. దీంతో గుండె, ధమనుల మీద అదనపు భారం పడుతుంది. అప్పటికే అధిక రక్తపోటు, గుండెజబ్బులు గలవారికిది హానికరంగా పరిణమిస్తుంది. రక్త ప్రసరణ సాఫీగా సాగకపోవటం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదముంది. ముఖ్యంగా గుండె రక్తనాళాల్లో పూడికలు గలవారికి, అవి చిట్లిపోయి ఉదయం వేళల్లో గుండెపోటు ముప్పు ఎక్కువవుతుంది.

- **రక్తం గడ్డకట్టే స్వభావం పెరగటం**

గాయాలైనప్పుడు రక్తం గడ్డకడితే ప్రాణాలు నిలుస్తాయి. కానీ రక్తనాళాల లోపల రక్తం గడ్డలు ఏర్పడితే గుండెపోటు, పక్షవాతానికి దారితీస్తుంది. మన శరీరంలో సహజంగానే రక్తాన్ని పలుచగా, గడ్డలు కట్టకుండా చూసే వ్యవస్థ ఉంటుంది. కాకపోతే ఇది ఉదయం వేళల్లో మందగిస్తుంది. దీంతో రక్తం చిక్కబడి, రక్తం గడ్డలు ఏర్పడే ముప్పు పెరుగుతుంది. ఉదయం వేళల్లో ప్లేట్‌లెట్లు చురుకుగా పనిచేయటం మూలంగానూ రక్తం గడ్డకట్టే స్వభావం పెరుగుతుంది. ఇది రక్త ప్రసరణ తీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా గుండె పోటు ముప్పు పెరుగుతుంది.

- **రక్తనాళాల బిగువు**

రక్తం సాఫీగా సరఫరా కావాలంటే రక్తనాళాలు మృదువుగా, సాగేలా ఉండాలి. ఉదయం పూట సహజంగానే రక్తనాళాలు బిగువుగా ఉంటాయి. అదే సమయంలో రక్తపోటూ కాస్త పెరుగుతుంది. దీనికి తగినట్టుగా రక్తనాళాలు సాగకపోతే గుండె మీద భారం పెరుగుతుంది.

- **నీటి శాతం తగ్గటం**

పగటిపూట నీళ్లు బాగానే తాగుతాం. కానీ రాత్రిపూట పెద్దగా పట్టించుకోం. కొందరు మధ్యలో మూత్ర విసర్జనకు లేవాల్సి వస్తుందని నీళ్లు తాగరు. ఫలితంగా ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది (డీహైడ్రేషన్). దీంతో రక్తం పరిమాణం తగ్గుతుంది. మరోవైపు రక్తంలో ఉప్పు మోతాదూ ఎక్కువై, రక్తం చిక్కబడుతుంది. అంత తేలికగా కదలదు. ఇలాంటప్పుడు శరీరమంతా రక్తాన్ని సరఫరా చేయటానికి గుండె మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. ఇదీ ముప్పును తెచ్చిపెడుతుంది.

- **నిద్ర సమస్యలు**

నిద్ర సమస్యలు గుండెకు చేటు చేస్తాయి. నిద్ర పోతున్నప్పుడు కాసేపు శ్వాస ఆగటం (స్లీప్ అప్నియా), నిద్రలేమి వంటి సమస్యలు కంటి నిండా నిద్ర పట్టకుండా చేస్తాయి. దీంతో శరీరానికి తగినంత విశ్రాంతి లభించదు. అంతేకాదు, ఒంట్లో వాపు ప్రక్రియ ప్రేరేపితమై గుండెజబ్బు ముప్పు పెరిగేలా చేస్తుంది నిద్రలేమి, నిద్రకు భంగం కలగటం వల్ల కుంగుబాటు వంటి మానసిక సమస్యలూ ముంచుకొస్తాయి. ఇవీ గుండెకు చేటు చేసేవే. రాత్రిపూట తగినంత నిద్ర పోకపోతే వేకువ జామున, ఉదయం పూట గుండె తీవ్ర ఒత్తిడికి లోనై సమస్యాత్మకంగా పరిణమిస్తుంది.

- **ఉన్నట్టుండి ఉద్ధృతంగా పనులు**

కొందరు నిద్ర లేవగానే వ్యాయామం వంటి శ్రమతో కూడిన పనులకు దిగుతుంటారు. సాధారణంగా ఉదయం పూట శరీరం విశ్రాంతి స్థితి నుంచి నెమ్మదిగా కోలుకుంటూ వస్తుంటుంది. ఈ సమయంలో ఉన్నట్టుండి తీవ్రంగా శ్రమ చేసినట్టయితే గుండె మీద అదనపు భారం పడుతుంది.

**ముప్పు కారకాలు ఇవీ**

- మధుమేహం
- అధిక రక్తపోటు
- అధిక కొలెస్ట్రాల్
- మానసిక ఒత్తిడి
- నెలసరి ఆగిపోవటం
- స్లీప్ అప్నియా

**నివారణ మార్గముంది**

కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవాలి. రాత్రిపూట 7 గంటల సేపు గాఢంగా నిద్రిస్తే హార్మోన్లు అస్తవ్యస్తం కావటాన్ని తగ్గించుకోవచ్చు.

ఉదయం నిద్ర లేచాక ఓ గ్లాసు నీళ్లు తాగటం మంచిది. కెఫీన్‌తో కూడిన కాఫీ వంటివి అతిగా తీసుకోవద్దు.

మంచం మీద నుంచి ఉన్నట్టుండి లేవొద్దు. కాసేపు కూర్చోవాలి. కాళ్లూ చేతులు, మెడ, నడుం కదిలించి, సాగదీయాలి. నిద్రలేచాక తొలి అరగంటలో తీవ్రమైన శ్రమ చేయకుండా చూసుకోవాలి.

ఉదయం పూట కాసేపు గాఢంగా శ్వాస తీసుకోవటం, ధ్యానం చేయటం మేలు. ఇవి మానసిక ప్రశాంతత చేకూరుస్తాయి.

మందులు వాడేవారైతే రక్తాన్ని పలుచగా చేసే మందులను రాత్రిపూట వేసుకోవాలి. బీపీ మాత్రనూ రాత్రిపూట వేసుకోవటం మంచిది. చాలాదేశాల్లో ఇదే నియమాన్ని పాటిస్తున్నారు. బీపీ మాత్ర 12 గంటలే పనిచేస్తుంది. కాబట్టి పగటి పూట రక్తపోటు అదుపులో ఉంటుందో లేదో కూడా చూసుకోవాలి. ఒకవేళ పగలు రక్తపోటు ఎక్కువగా ఉంటున్నట్టయితే ఉదయం పూట మరో మాత్రను వాడుకోవాల్సి ఉంటుంది.

**సోమవారం ముప్పు**

కొందరు, ముఖ్యంగా ఉద్యోగులు సోమవారం తెల్లవారు జామున గుండెపోటు బారినపడటం చూస్తుంటాం. ఉద్యోగులు వారాంతాల్లో విశ్రాంతి తీసుకుంటుంటారు కదా. మర్నాడు తిరిగి ఆఫీసుకు వెళ్లే క్రమంలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. దీన్నే మండే మార్నింగ్ సింధ్రోమ్ అనీ అంటారు. కొందరు వారాంతాల్లో మద్యం అతిగా తాగొచ్చు. సరిగా నిద్రపోక పోవచ్చు. ఇవన్నీ గుండెపోటు ముప్పు పెరిగేలా చేస్తుంటాయి.



# పనస పానీయం

పనస తొనల రుచి, వాసనల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంది? ఇవి ఈ కాలంలో విస్తృతంగా లభిస్తాయి. పోషకాల పనస తొనలతో శరీరానికి చలువనిచ్చే పానీయం చేసుకోవచ్చు. ఈ జ్యూస్ కోసం.. పనస తొనలు ఐదు, కాచి చల్లార్చిన పాలు ముప్పావు కప్పు, బాదంపప్పులు నాలుగు, జీడిపప్పులు ఐదు, పంచదార 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి.

**ఎలా చేయాలంటే..**

పనస తొనల్లో గింజలు తీసి.. జీడిపప్పు, బాదం, పంచదార వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. అందులో కాచి చల్లార్చిన పాలు జతచేసి మళ్లీ గ్రైండ్ చేయాలి. అంతే.. రుచికరం, ఆరోగ్యదాయకం అయిన జ్యూస్ సిద్ధమవుతుంది. జ్యూస్ మరీ చిక్కగా ఉందనిపిస్తే కొన్ని పాలు లేదా నీళ్లు కలపవచ్చు. చల్లగా కావాలనుకుంటే రెండు ఐస్ క్యూబ్స్ వేయొచ్చు. పాలకు బదులు కొబ్బరి పాలు, పంచదారకు ప్రత్యామ్నాయంగా బెల్లం ఉపయోగించవచ్చు.

**ఎంత మేలు చేస్తుందంటే..**

- పనస జ్యూస్ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- కంటిచూపు మెరుగుపడుతుంది.
- ఇందు లోని సహజ చక్కెరలు శరీరానికి తక్షణశక్తినిస్తాయి.
- పాలు కలపడం వల్ల క్యాల్షియం అందుతుంది.
- ఈ జ్యూస్ తాగితే పొట్ట నిండిన భావన కలిగి ఎక్కువసేపు ఆకలి వేయదు. తద్వారా బరువు నియంత్రణలో ఉంటుంది.
- ఇందులోని ఐరన్ హిమోగ్లోబిన్ స్థాయిని పెంచి రక్తహీనత సమస్య రానివ్వదు.
- ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా పనిచేస్తుంది. మలబద్ధకం తగ్గుతుంది.
- పనస లోని యాంటీఆక్సిడెంట్స్ అనారోగ్యం బారిన పడకుండా కాపాడతాయి.
- పనసలో బీ2, బీ3, బీ6, పొటాషియం, మెగ్నీషియం, క్యాల్షియం, భాస్వరం, జింక్, కాపర్, మాంగనీస్ సమృద్ధిగా ఉన్నందున పోషకాలు అందుతాయి.
- శరీర పనితీరు సక్రమంగా ఉంటుంది.
- చర్మాన్ని కాపాడటంలో, కురులను సంరక్షించడంలో ఈ జ్యూస్ తోడ్పడుతుంది.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఐఏఎస్**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 14:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (Special Intensive Revision SIR) షెడ్యూల్ అమలుపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈరోజు జిల్లాలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులతో (EROలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులతో (AEROలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, సమగ్రతతో ఓటరు జాబితా తయారు చేయడం ప్రతి ఎన్నికల అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ SIR కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎలెక్టర్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటి సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు సవరణలు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల తొలగింపు వంటి అంశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, తప్పుడు వివరాలు, అర్హత లేని పేర్లు జాబితాలో చేరకుండా తగిన పరిశీలన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి మాత్రమే ఆమోదించాలని ఆదేశించారు. అదేవిధంగా, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో (BLOలు) సమన్వయం పెంచుకుని, గ్రామాలు, కాలనీలు, అపార్ట్మెంట్లు, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరును మ్యాప్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువ ఓటర్లు, మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు మరియు అన్ని వర్గాల ఎలెక్టర్లు ఈ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా పరిశుభ్రత, పారదర్శకత మరియు ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల విభాగ అధికారులు, EROలు, AEROలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలి

- **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 14:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభమయిన విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం జయశంకర్ బడిబాట, పేరెంట్ టీచర్ మీటింగ్ ను రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం నేదునూర్ తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుండి విద్యా వారోత్సవాలను ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా నేడు జయశంకర్ బడిబాట, పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో నెలకు ఒకసారి పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తారు, తమ పిల్లలు ఏవిధంగా చదువుతున్నారో ఈ మీటింగు ద్వారా తెలుసుకోవడం జరుగుతుందని, అలాంటి సమావేశాలను మన ప్రభుత్వ పాఠశాలలో కూడా నిర్వహించి తల్లిదండ్రులకు వారి పిల్లలు చదువులో ఏవిధంగా రాణిస్తున్నారో తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వెరీ క్వాలిఫైడ్ టీచర్స్ బోధన చేయడం జరుగుచున్నదని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రెండు జతల యూనిఫామ్ కూడా అందించడం జరుగుతున్నదని తెలియపరు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసి పని చేయడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధనా అందించి విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు వీలవుతుందని, అందుకు గ్రామ స్థాయి పాలకవర్గం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలలో చేరేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను కల్పించడం జరుగుచున్నది, తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే అన్నీ వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే నేడు అని రంగాల్లో రాణించడం జరుగుతున్నదని, అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు సమస్యలను ఎదుర్కొనే శక్తి అలవాడుతుందన్నారు. సమస్యలను పరిష్కరించే అవగాహన కలుగుతుందని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలను ఈ సందర్భంగా కలెక్టర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక ముందు కూడా ఇదే స్పూర్తితో ఉన్నత చదువులలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేదునూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియా, ఎంపిడిఓ, తహాశీల్దార్ గోపాల్, ఎమ్ఈఓ, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మహిళల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత మహిళా కమిషన్ సభ్యురాలిగా నియామకం గర్వకారణం**
- **సంక్షేమ శాఖ మంత్రి శ్రీ.అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైద్రాబాద్ వెలుతురు మే 14:** ఈ నెల 11వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా నియమితులైన నల్గొండ జిల్లాకు చెందిన శ్రీమతి చిట్యాల శ్వేత గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, మహిళా ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన వీరవనిత చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమితులవడం గర్వకారణమన్నారు. సామాజిక న్యాయం, మహిళా హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆమె సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా కమిషన్ మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, చట్టపరమైన సహాయం అందించడంలో కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలు, అణగారిన వర్గాలకు చెందిన మహిళల సమస్యల పరిష్కారంపై మహిళా కమిషన్ దృష్టి సారించాలని మంత్రి సూచించారు. మహిళల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, వేధింపులు మరియు వివక్షకు గురైన బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించడం వంటి అంశాల్లో కమిషన్ మరింత చురుకుగా వ్యవహరించాలని అన్నారు. అలాగే మహిళలపై జరుగుతున్న సామాజిక, ఆర్థిక, మానసిక వేధింపుల నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు స్వయం సమృద్ధితో ముందుకు సాగేందుకు ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా చిట్యాల శ్వేత మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, బాధిత మహిళలకు న్యాయం అందించే దిశగా అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## తూంకుంట రైతులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి.

**మేడ్చల్ వెలుతురు మే 14:** సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన తూంకుంట రైతులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి. గురువారం కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి తూంకుంట గ్రామంలో 24 ఏకరాలకు గాను మొదటి విడతగా 14203 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన రైతులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ 103 కోట్ల రూపాయల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దఫాగా ఈ చెక్కులు అందించడం జరిగిందని, మిగిలిన వారికి తరువాత అందించడం జరుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. తమ భూమికి చదరపు గజం లక్ష రూపాయలుగా ధర నిర్ణయించడంలో కలెక్టర్ చొరవ తీసుకున్నారని రైతులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు అందజేసారు. మాజీ సర్పంచ్ సాగర్, సంజయ్ అగర్వాల్, విజయలక్ష్మి, సతీష్, పద్మప్రసాద్, అరుణ వీరందరు కలెక్టర్ ను శాలువతో సన్మానించారు.




# ధాన్యం కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే

- **చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్, పొంగులేటి**
- **యాసంగి సీజన్‌లో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం**
- **రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా**
- **కూసుమంచి మండలం పాలేరులో కొనుగోలు కేంద్రం పరిశీలన**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారుల సమీక్ష**
- **ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం**
- **రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం రవాణా వ్యవస్థ బలోపేతానికి చర్యలు**
- **బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి హమాలీలు రానందున కొరత**
- **కలెక్టర్లకు లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు**
- **కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు సూచనలు**
- **రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం**

**కూసుమంచి మండలం వెలుతురు మే 14:** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వరి రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ కొనుగోలు విధానం పట్ల పూర్తి విశ్వాసంతో ఉండాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం రోజున కూసుమంచి మండలం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల పనితీరు, ధాన్యం సేకరణ ప్రక్రియ, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సుమారు 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రధానంగా ఎదురవుతున్న ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధాన్యం సేకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యవస్థను సరిచేస్తున్నామని వివరించారు. హమాలీల కొరత సమస్యపై మాట్లాడుతూ బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో హమాలీలు తెలంగాణకు వస్తారని తెలిపారు. అయితే ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రక్రియ కారణంగా అక్కడి నుంచి హమాలీల రాక తగ్గిందని, దీంతో కొంత కొరత ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం రవాణా కోసం అవసరమైన లారీలు, డీసీఎంలను తక్షణమే సమకూర్చాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా వేగంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం తూకం, కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. తాగునీరు, నీడ, నిల్వ సౌకర్యాలు వంటి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com